https://siddipettimes.com

# సిద్దిపేట టైమ్స్

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 | సంచిక -265 | తెలంగాణ | ఆదివారం | తేదీ: 01.03.2026 | ఎడిటర్ : మదూరి శ్రీరామ్ | పేజీలు 8 | వెల రూ.3



హెచ్‌పీవీ టీకా షురూ..

2లో..




## ప్రజలే కేంద్రంగా ప్రగతి ప్రణాళిక

- అధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం
- జూన్ 12 వరకు 99 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక'
- ఇంటి నుంచే ప్రభుత్వ సేవలు పొందేలా సాంకేతిక సంస్కరణలపై ప్రత్యేక దృష్టి
- ఐఏఎస్ జయేశ్ రంజన్ ఆధ్వర్యంలో సాంకేతిక మార్పులపై ఏకసభ్య కమిటీ నియామకం
- రూ. 8 లక్షల కోట్ల పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా అధికారులకు ఆదేశం
- 100 మండలాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో 'తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల' ప్రారంభం

2లో..

సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 28:
ప్రజలు కోరుకున్న మార్పును నిజం చేస్తూ, పారదర్శకత మరియు జవాబుదారీతనంతో కూడిన పాలనను అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం సచివాలయంలో అన్ని శాఖల కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత రెండేళ్ల మూడు నెలల పాలనలోని విజయాలను, లోటుపాట్లను సమీక్షించుకోవాలని అధికారులకు సూచించారు. మిగిలిన పదవీ కాలంలో చేపట్టాల్సిన పనులపై పక్కా కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని ఆదేశించారు. రాష్ట్రంలో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక'ను పకడ్బందీగా అమలు చేయాలని సీఎం ఆదేశించారు.





## పశ్చిమాసియాలో భీకర యుద్ధం

### ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ మెరుపు దాడులు

- 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో ఇరాన్ సుప్రీం లీడర్ లక్ష్యంగా దాడులు
- పాఠశాలపై బాంబు దాడిలో 86 మంది విద్యార్థినులు సహా 201 మంది మృతి
- అమెరికా స్థావరాలు, ఇజ్రాయెల్‌పై క్షిపణులతో విరుచుకుపడ్డ ఇరాన్
- యుద్ధం కారణంగా హైదరాబాద్ సహా అంతర్జాతీయ విమాన సర్వీసులు నిలిపివేత

2లో..

దుబాయ్, టెల్ అవీవ్, వాషింగ్టన్: పశ్చిమాసియాలో మరో భీకర యుద్ధం మొదలైంది. ఇరాన్ లక్ష్యంగా శనివారం ఉదయం అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు భారీ వైమానిక దాడులకు దిగాయి. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో చేపట్టిన ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ నివాసం, కార్యాలయాలే లక్ష్యంగా బాంబుల వర్షం కురిపించారు. ఈ దాడుల వల్ల ఇరాన్ అంతటా యుద్ధాగ్ని జ్వాలలు ఎగసిపడుతున్నాయి.





## 20 మంది సజీవ దహనం

- కాకినాడ జిల్లా వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో ఘోర విస్ఫోటనం
- పేలుడు ధాటికి ఛిద్రమైన శరీర భాగాలు.. 5 కిలోమీటర్ల మేర కంపించిన ఇళ్లు
- గాయపడిన మరో 10 మంది పరిస్థితి విషమం.. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50 వేల పీఎంఎన్‌ఆర్‌ఎఫ్ సాయం

2లో..

సిద్దిపేట టైమ్స్,కాకినాడ, ఫిబ్రవరి 28:
కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో శనివారం మధ్యాహ్నం పెను విషాదం చోటుచేసుకుంది. ఇక్కడి 'సూర్యశ్రీ ఫైర్ వర్క్స్' బాణసంచా తయారీ కేంద్రంలో భారీ విస్ఫోటం సంభవించి 20 మంది కార్మికులు సజీవ దహనమయ్యారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదం వల్ల ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా భీతావహంగా మారింది. పేలుడు తీవ్రతకు అక్కడ పనిచేస్తున్న వారి శరీర భాగాలు చెల్లాచెదురై సమీపంలోని చెట్లు, పొలాల్లో పడటం అక్కడి దారుణ పరిస్థితికి అద్దం పడుతోంది.

## ఒక్కొక్కరికి రూ.20 లక్షల పరిహారం

- వేట్లపాలెం బాధితులకు సీఎం చంద్రబాబు ప్రకటన
- విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఆర్డీవో, డీఎస్పీ సహా నలుగురు అధికారుల సస్పెన్షన్
- నిబంధనలు ఉల్లంఘించిన యజమాని ఆస్తుల జప్తునకు ముఖ్యమంత్రి ఆదేశం
- మృతుల పిల్లలకు రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉచిత విద్య అందిస్తామని హామీ
- బాణసంచా తయారీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ ద్వారా నిరంతర నిఘా

2లో..



## మదీనాబస్సు ప్రమాద బాధితులకు సీఎం రేవంత్ రెడ్డి భరోసా

- మదీనా బస్సు ప్రమాద మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందజేత
- గాయపడిన వ్యక్తికి రూ. 3 లక్షల ఆర్థిక సాయం అందించిన ముఖ్యమంత్రి
- బాధితుల కష్టసుఖాల్లో తోడుగా ఉంటామని ప్రజా ప్రభుత్వం తరపున హామీ
- మృతుల అంత్యక్రియలు జన్నతుల్ బఖీలో జరిగేలా సౌదీ ప్రభుత్వంతో సమన్వయం

2లో..

సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 28:
సౌదీ అరేబియాలోని మదీనాలో జరిగిన బస్సు ప్రమాద బాధితులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. శనివారం సచివాలయంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్‌తో కలిసి బాధితుల కుటుంబాలకు పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ ప్రమాదంలో మరణించిన 44 మంది కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పన, గాయపడిన ఒకరికి రూ. 3 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. సాధారణంగా దేశం వెలుపల జరిగే ప్రమాదాలకు ప్రభుత్వాలు పరిహారం ఇవ్వకపోయినా, బాధితుల దయనీయ స్థితిని చూసి మానవత్వంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం వెల్లడించారు.



## మార్కండేయ దేవాలయంలో ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



- శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి ఆధ్వర్యంలో ఉత్సవాలు..
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కల్వకుంట్ల వంశీధర్ రావు, వంగా రాజేశ్వర్ రెడ్డి..

సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, ఫిబ్రవరి 28
సిద్దిపేట శ్రీ మార్కండేయ దేవాలయంలో పట్టణ పద్మశాలి సమాజం అద్వర్యం లో ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారి కరకమలములచే యంత్ర ప్రతిష్టా, ధ్వజప్రతిష్టా ఘనంగా జరిగింది. సమాజం అధ్యక్షుడు కాముని రాజేశం, సమాజం సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం 8.00 గం||లకు ఆవాహిత పూజ, గర్త సంస్కారము జరిగింది. సాయంత్రం 9.25 ని||లకు : మేషలగ్న శుభాంశ సుముహూర్తమున శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారి కరకమలములచే యంత్ర ప్రతిష్టా, ధ్వజప్రతిష్టా, కళాన్యాసం, న్యాసహవనము, ప్రాణ ప్రతిష్టా, బలిప్రదానము, పూర్ణాహుతి, అభిషేకము, అవభృథము, అన్నప్రసాదము, ఆశీర్వచనము, ఋత్విక్ సన్మానము నిర్వహించారు.

2లో..





# మార్కండేయ దేవాలయంలో ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

- శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి ఆధ్వర్యంలో ఉత్సవాలు..
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కల్వకుంట్ల వంశీధర్ రావు, వంగా రాజేశ్వర్ రెడ్డి..

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, ఫిబ్రవరి 28**

సిద్దిపేట శ్రీ మార్కండేయ దేవాలయంలో పట్టణ పద్మశాలి సమాజం అద్వర్యం లో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారి కరకమలములచే యంత్ర ప్రతిష్టా, ధ్వజప్రతిష్టా ఘనంగా జరిగింది. సమాజం అధ్యక్షుడు కాముని రాజేశం, సమాజం సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం 8.00 గం॥లకు ఆవాహిత పూజ, గర్త సంస్కారము జరిగింది. సాయంత్రం 9.25 ని॥లకు : మేషలగ్న శుభాంశ సుముహూర్తమున శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారి కరకమలములచే యంత్ర ప్రతిష్టా, ధ్వజప్రతిష్టా, కళాన్యాసం, న్యాసహవనము, ప్రాణ ప్రతిష్టా, బలిప్రదానము, పూర్ణాహుతి, అభిషేకము, అవభృథము, అన్నప్రసాదము, ఆశీర్వచనము, ఋత్విక్ సన్మానము నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కెవిఆర్ ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్ రావు, బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ వంగా రాజేశ్వర్ రెడ్డిలు ముఖ్య అతిధులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ్యులు శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారి ఆశీర్వాదాలు పొందారు. ఉపాధ్యక్షులు పెద్ది అశోక్, ఇప్పకాల శ్రీహరి, ప్రధాన కార్యదర్శి సిరిగాది బాల్ రాజు, సహాయ కార్యదర్శిలు గుండు రవితేజ (లడ్డు), చిలుక ఆంజనేయులు, కోశాధికారి సూరం ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పెద్ది శ్రీనివాస్, బైరి ప్రకాష్, దీకొండ మహేష్, కొండబత్తిని రాజ్ కోటి, పేర్ల రాజేంద్రప్రసాద్, దండే సంతోష్ కుమార్, వీరబత్తిని నగేష్, ఆదేపు నాగరాజు, గోటిపాముల జలజ, సిరిముల్ సునీత, పుట్ట సునీత, యువజన సంఘం, మహిళా సంఘం, 43 వార్డుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కల్వకుంట వంశీధర్ రావు, వంగ రాజేశ్వర్ రెడ్డి లకు మరియు ఈ మహోత్సవాన్ని విజయవంతం చేసిన దేవస్థాన కమిటీ సభ్యులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు.



# హెచ్‌పీవీ టీకా షురూ

- 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా పంపిణీ ప్రారంభం
- 'గార్డాసిల్-4' సింగిల్ డోస్ ద్వారా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు చెక్
- కాంగ్రెస్‌ను 'ముస్లిం లీగ్-మావోయిస్టు' పార్టీగా అభివర్ణించిన ప్రధాని మోదీ
- వరుస ఓటములతో కాంగ్రెస్ దేశ ప్రతిష్టను కించపరుస్తోందని మండిపాటు

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని ప్రధాని మోదీ రాజస్థాన్‌లోని అజ్‌మేర్‌లో ప్రారంభించారు. మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను అరికట్టడమే లక్ష్యంగా 14 ఏళ్ల బాలికలకు 'గార్డాసిల్ 4' అనే సింగిల్ డోస్ టీకాను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోంది. ఈ వ్యాక్సిన్ హెచ్‌పీవీ టైప్ 16, 18 సహా ఇతర రకాల వైరస్ల నుండి పటిష్టమైన రక్షణ కల్పిస్తుందని కేంద్రం వెల్లడించింది. అదే వేదికపై ప్రధాని మోదీ కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ఇప్పుడు 'ముస్లిం లీగ్‌మావోయిస్టు' పార్టీగా మారిందని విమర్శించారు. ఎన్నికల్లో వరుసగా ఓడిపోతున్నందుకే ఆ పార్టీ దేశ ప్రతిష్టను దిగజార్చేలా ప్రతీకారం తీర్చుకుంటోందని మండిపడ్డారు. ప్రపంచం భారత్‌ను ప్రశంసిస్తుంటే, కాంగ్రెస్ మాత్రం దేశాన్ని కించపరిచే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.

# ఒక్కొక్కరికి రూ.20 లక్షల పరిహారం

- వేట్లపాలెం బాధితులకు సీఎం చంద్రబాబు ప్రకటన
- విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఆర్డీవో, డీఎస్పీ సహా నలుగురు అధికారుల సస్పెన్షన్
- నిబంధనలు ఉల్లంఘించిన యజమాని ఆస్తుల జప్తునకు ముఖ్యమంత్రి ఆదేశం
- మృతుల పిల్లలకు రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉచిత విద్య అందిస్తామని హామీ
- బాణసంచా తయారీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ ద్వారా నిరంతర నిఘా

**సిద్దిపేట టైమ్స్, కాకినాడ, ఫిబ్రవరి 28:**



కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణసంచా ప్రమాద మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భారీ పరిహారం ప్రకటించారు. శనివారం రాత్రి కాకినాడ జీజీహెచ్‌లో క్షతగాత్రులను పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒక్కో కుటుంబానికి రూ.20 లక్షల చొప్పున అందజేస్తామని వెల్లడించారు. దీనికి అదనంగా కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షల పరిహారం ఇస్తుందని తెలిపారు. చనిపోయిన వారిలో ఎక్కువ మంది బడుగు, బలహీన వర్గాలకు చెందినవారేనని, ఈ ఘటనలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్పించి చదివిస్తామని సీఎం భరోసా ఇచ్చారు. ఈ ఘోర ప్రమాదానికి అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులను చేస్తూ ఆర్డీవో, డీఎస్పీ, జిల్లా కార్మిక శాఖ అధికారి, అగ్నిమాపక శాఖ అధికారులను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. నిబంధనలకు విరుద్ధంగా తయారీ కేంద్రం నడిపిన యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఆయన ఆస్తులను జప్తు చేసి బాధితులకు అందజేయాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాణసంచా తయారీ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే సీఎం చంద్రబాబు తన విజయనగరం పర్యటనను రద్దు చేసుకుని హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. ప్రోటోకాల్ మరియు అత్యున్నత భద్రతను పక్కనపెట్టి, కలెక్టర్ వాహనంలోనే మట్టి రోడ్లపై ప్రయాణించి ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించారు. చీకటి పడినా లెక్కచేయకుండా బురదలో నడుచుకుంటూ వెళ్లి తయారీ కేంద్రాన్ని స్వయంగా చూశారు. అనంతరం సామర్లకోట మార్చురీలో ఉన్న మృతదేహాలను సందర్శించి, బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. తగిన ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్లే ప్రాణాలకు తెగించి బాణసంచా కేంద్రాలకు కూలీకి వెళ్తున్నామని బాధితులు సీఎం వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రాజమహేంద్రవరం విమానాశ్రయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఒకరికొకరు ఎదురయ్యారు. కాకినాడలో పరామర్శ ముగించుకుని సీఎం అమరావతికి బయలుదేరగా, అదే సమయంలో పవన్ కల్యాణ్ బాధితులను కలిసేందుకు విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ దుర్ఘటనపై ఇద్దరు నేతలు అక్కడే కాసేపు చర్చించుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి నిల్వలు ఉంచడమే ప్రమాద తీవ్రతకు కారణమని ప్రాథమికంగా గుర్తించినట్లు వారు అభిప్రాయపడ్డారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ కూడా ఈ ఘటనపై స్పందిస్తూ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. 20 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ముప్పులు పొంచి ఉన్న పరిశ్రమల విషయంలో ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు అనిత, కందుల దుర్గేష్ మరియు ఇతర ప్రజా ప్రతినిధులు పర్యటనలో పాల్గొని బాధితులకు ధైర్యం చెప్పారు.

# పశ్చిమాసియాలో భీకర యుద్ధం

- ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ మెరుపు దాడులు
- 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో ఇరాన్ సుప్రీం లీడర్ లక్ష్యంగా దాడులు
- పాఠశాలపై బాంబు దాడిలో 86 మంది విద్యార్థినులు సహా 201 మంది మృతి
- అమెరికా స్థావరాలు, ఇజ్రాయెల్‌పై క్షిపణులతో విరుచుకుపడ్డ ఇరాన్
- యుద్ధం కారణంగా హైదరాబాద్ సహా అంతర్జాతీయ విమాన సర్వీసులు నిలిపివేత



**దుబాయ్, టెల్ అవీవ్, వాషింగ్టన్:** పశ్చిమాసియాలో మరో భీకర యుద్ధం మొదలైంది. ఇరాన్ లక్ష్యంగా శనివారం ఉదయం అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు భారీ వైమానిక దాడులకు దిగాయి. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో చేపట్టిన ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ నివాసం, కార్యాలయాలే లక్ష్యంగా బాంబుల వర్షం కురిపించారు. ఈ దాడుల వల్ల ఇరాన్ అంతటా యుద్ధాగ్ని జ్వాలలు ఎగసిపడుతున్నాయి. ఈ దాడుల్లో ఇరాన్ రక్షణ శాఖ మంత్రి అమీర్ నసీర్జాదే, రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ మొహమ్మద్ పాక్‌పూర్ మరణించినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. దక్షిణ ఇరాన్‌లోని మినాబ్‌లో ఒక బాలికల పాఠశాలపై బాంబులు పడటంతో 86 మంది విద్యార్థినులు ప్రాణాలు కోల్పోయారు. మొత్తంగా ఇరాన్‌లో 201 మంది మృతి చెందగా, 747 మంది గాయపడ్డారని రెడ్ క్రెసెంట్ సంస్థ వెల్లడించింది. ఇరాన్ సైతం ఈ దాడులపై తీవ్రంగా స్పందించింది. ఇజ్రాయెల్‌పై 200కు పైగా డ్రోన్లు, క్షిపణులను ప్రయోగించింది. వీటితో పాటు బహ్రెయిన్, కువైట్, ఖతార్, యూఏఈ వంటి దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ విరుచుకుపడింది. బహ్రెయిన్‌లోని అమెరికా నౌకాదళ 5వ ఫ్లీట్ ప్రధాన కార్యాలయం మంటల్లో చిక్కుకోగా, దుబాయ్‌లోని పామ్ జుమేరియాలో ఒక పర్యాటక హోటల్ దెబ్బతింది. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ సందర్భంగా ఇరాన్ ప్రజలకు కీలక పిలుపునిచ్చారు. 1979 నుంచి పాలిస్తున్న ఇస్లామిక్ నాయకత్వం నుంచి దేశాన్ని విముక్తి చేసుకోవాలని కోరారు. ఇటు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు మాట్లాడుతూ.. ఇరాన్ ప్రజలు తమ తలరాతను తామే నిర్ణయించుకునేలా చేసేందుకే ఈ దాడులు నిర్వహిస్తున్నామని వ్యాఖ్యానించారు. ఇరాన్ ప్రభుత్వం ఈ దాడులను తీవ్రంగా ఖండించింది. దేశాన్ని రక్షించుకోవాల్సిన సమయం వచ్చిందని, శత్రువులకు గట్టి బుద్ధి చెబుతామని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రకటించింది. ఖమేనీ, అధ్యక్షుడు పెజెష్కియాన్ సురక్షితంగా ఉన్నారని స్పష్టం చేసింది. మరోవైపు యెమెన్‌కు చెందిన హూతీ రెబల్స్ కూడా ఇరాన్‌కు మద్దతుగా ఎర్ర సముద్రంలోని నౌకలపై దాడులు మొదలుపెట్టారు. యుద్ధం తీవ్రమవ్వడంతో ఇజ్రాయెల్‌లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. సైరన్ల మోతతో ప్రజలందరూ బంకర్లలో తలదాచుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. పలు దేశాలు తమ గగనతలాలను మూసివేయడంతో పశ్చిమాసియా మీదుగా ప్రయాణించే వేలకొద్దీ విమాన సర్వీసులు రద్దయ్యాయి. గల్ఫ్ దేశాల్లోని విదేశీ రాయబార కార్యాలయ సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లే 44 అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దయ్యాయి. అబుధాబి, దుబాయ్, కువైట్, దోహా వెళ్లాల్సిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితి చక్కబడే వరకు టికెట్లు బుక్ చేసుకోవద్దని విమానయాన సంస్థలు సూచించాయి. ప్రపంచ దేశాలు ఈ యుద్ధంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇరు పక్షాలు సంయమనం పాటించాలని, తక్షణమే యుద్ధాన్ని విరమించి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని భారతదేశం పిలుపునిచ్చింది. యుద్ధం మరింత ముదిరితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా చమురు సరఫరాపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.



# ప్రజలే కేంద్రంగా ప్రగతి ప్రణాళిక

- అధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం
- జూన్ 12 వరకు 99 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక'
- ఇంటి నుంచే ప్రభుత్వ సేవలు పొందేలా సాంకేతిక సంస్కరణలపై ప్రత్యేక దృష్టి
- ఐఏఎస్ జయేశ్ రంజన్ ఆధ్వర్యంలో సాంకేతిక మార్పులపై ఏకసభ్య కమిటీ నియామకం
- రూ. 8 లక్షల కోట్ల పెట్టుబడులు కార్యరూపం దాల్చేలా అధికారులకు ఆదేశం
- 100 మండలాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో 'తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల' ప్రారంభం

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 28:**



ప్రజలు కోరుకున్న మార్పును నిజం చేస్తూ, పారదర్శకత మరియు జవాబుదారీతనంతో కూడిన పాలనను అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం సచివాలయంలో అన్ని శాఖల కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత రెండేళ్ల మూడు నెలల పాలనలోని విజయాలను, లోటుపాట్లను సమీక్షించుకోవాలని అధికారులకు సూచించారు. మిగిలిన పదవీ కాలంలో చేపట్టాల్సిన పనులపై పక్కా కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని ఆదేశించారు. రాష్ట్రంలో మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు 'ప్రజా పాలనప్రగతి ప్రణాళిక'ను పకడ్బందీగా అమలు చేయాలని సీఎం ఆదేశించారు. జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించాలని, ఇందుకోసం ప్రత్యేక లోగోను సిద్ధం చేయాలని చెప్పారు. ఈ 99 రోజుల్లో పెండింగ్‌లో ఉన్న దస్త్రాల పరిష్కారం కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, పథకాల పురోగతిని తానే స్వయంగా ప్రతిరోజూ పర్యవేక్షిస్తానని అధికారులను హెచ్చరించారు. పాలనలో సాంకేతిక సంస్కరణల ప్రాధాన్యతను వివరిస్తూ, ప్రజలు ప్రభుత్వ సేవలను ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా పొందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. దీనిపై సమగ్ర నివేదిక ఇచ్చేందుకు సీనియర్ ఐఏఎస్ జయేశ్ రంజన్ ఆధ్వర్యంలో ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని, మూడు వారాల్లో నివేదిక అందజేయాలని ఆదేశించారు. ప్రతి విభాగం ఈఆఫీస్ విధానాన్ని పాటించాలని, రాబోయే 20 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా డేటా సర్వర్లను అప్‌డేట్ చేసుకోవాలని పేర్కొన్నారు. తెలంగాణను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు జోన్లుగా విభజించి అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం తెలిపారు. విదేశీ పర్యటనలు, గ్లోబల్ సమిట్ల ద్వారా రాష్ట్రానికి వచ్చిన సుమారు రూ. 8 లక్షల కోట్ల పెట్టుబడులు మరియు ఎంవోయూలు కార్యరూపం దాల్చే వరకు పారిశ్రామికవేత్తలతో నిరంతరం సంప్రదింపులు జరపాలి. ఫ్యూచర్ సిటీ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇది దేశ ఆర్థిక స్థితిగతులనే మార్చబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యా, వైద్య రంగాల ప్రక్షాళనలో భాగంగా రాష్ట్రంలోని వంద మండలాల్లో 'తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను' ప్రారంభిస్తామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండకూడదని, ప్రతి శాఖకు సొంత భవన నిర్మాణానికి బడ్జెట్‌లో నిధుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. కేవలం పనులు చేయడమే కాకుండా, వాటిని ప్రజలకు సమర్థంగా వివరించాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని, తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఐఏఎస్ అధికారి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

# మదీనాబస్సు ప్రమాద బాధితులకు సీఎం రేవంత్ రెడ్డి భరోసా

- మదీనాబస్సు ప్రమాద బాధితులకు సీఎం రేవంత్ రెడ్డి భరోసా
- మదీనా బస్సు ప్రమాద మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందజేత
- గాయపడిన వ్యక్తికి రూ. 3 లక్షల ఆర్థిక సాయం అందించిన ముఖ్యమంత్రి
- బాధితుల కష్టసుఖాల్లో తోడుగా ఉంటామని ప్రజా ప్రభుత్వం తరపున హామీ
- మృతుల అంత్యక్రియలు జన్నతుల్ బఖీలో జరిగేలా సౌదీ ప్రభుత్వంతో సమన్వయం

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 28:**

సౌదీ అరేబియాలోని మదీనాలో జరిగిన బస్సు ప్రమాద బాధితులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. శనివారం సచివాలయంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్‌తో కలిసి బాధితుల కుటుంబాలకు పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ ప్రమాదంలో మరణించిన 44 మంది కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున, గాయపడిన ఒకరికి రూ. 3 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. సాధారణంగా దేశం వెలుపల జరిగే ప్రమాదాలకు ప్రభుత్వాలు పరిహారం ఇవ్వకపోయినా, బాధితుల దయనీయ స్థితిని చూసి మానవత్వంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎం వెల్లడించారు. ప్రమాదం జరిగిన వెంటనే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి సహాయక చర్యలు చేపట్టినట్లు ముఖ్యమంత్రి వివరించారు. మంత్రి అజారుద్దీన్‌ను స్వయంగా మదీనాకు పంపి, మృతుల కుటుంబ సభ్యులకు తక్షణమే పాస్‌పోర్టులు, వీసాలు ఇప్పించి అక్కడికి పంపినట్లు తెలిపారు. భారత కాన్సులేట్ మరియు సౌదీ ప్రభుత్వంతో చర్చించి, మరణించిన వారి అంత్యక్రియలు పవిత్రమైన జన్నతుల్ బఖీలో నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. నాంపల్లి అగ్నిప్రమాద బాధితులను ఆదుకున్నట్లే, ఈ బాధితులకు కూడా ప్రభుత్వం అండగా ఉంటుందనే నమ్మకం కలిగించడమే తమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం తన వ్యక్తిగత సేవా కార్యక్రమాలను కూడా గుర్తు చేసుకున్నారు. కొడంగల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన 2009 నుంచి ప్రతి ఏటా తన సొంత ఖర్చులతో ఐదుగురిని హజ్ యాత్రకు పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వేం నరేందర్ రెడ్డి, హజ్ కమిటీ ఛైర్మన్ ఖుస్రోపాషా మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. బాధితులు ఎవరూ ఆందోళన చెందవద్దని, ఇది మీ ప్రజా ప్రభుత్వమని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# 20 మంది సజీవ దహనం

- కాకినాడ జిల్లా వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో ఘోర విస్ఫోటం
- పేలుడు ధాటికి ఛిద్రమైన శరీర భాగాలు.. 5 కిలోమీటర్ల మేర కంపించిన ఇళ్లు
- గాయపడిన మరో 10 మంది పరిస్థితి విషమం.. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50 వేల పీఎంఎన్‌ఆర్‌ఎఫ్ సాయం

**సిద్దిపేట టైమ్స్,కాకినాడ, ఫిబ్రవరి 28:**





కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో శనివారం మధ్యాహ్నం పెను విషాదం చోటుచేసుకుంది. ఇక్కడి 'సూర్యశ్రీ ఫైర్ వర్క్స్' బాణసంచా తయారీ కేంద్రంలో భారీ విస్ఫోటం సంభవించి 20 మంది కార్మికులు సజీవ దహనమయ్యారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదం వల్ల ఆ ప్రాంతమంతా ఒక్కసారిగా భీతావహంగా మారింది. పేలుడు తీవ్రతకు అక్కడ పనిచేస్తున్న వారి శరీర భాగాలు చెల్లాచెదురై సమీపంలోని చెట్లు, పొలాల్లో పడటం అక్కడి దారుణ పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో పది మందిని వెంటనే కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి (జీజీహెచ్) తరలించారు. వీరిలో తొమ్మిది మందికి 90 శాతానికి పైగా కాలిన గాయాలవ్వడంతో వారి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. బాణసంచా తయారీకి ఉపయోగించే ముడిసరకు నిల్వలు భారీగా ఉండటంతో మంటలు సుమారు రెండు గంటల పాటు అదుపులోకి రాలేదు. అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను ఆర్పిన తర్వాతే మృతదేహాలను వెలికితీసే వీలైంది. పేలుడు ధాటికి వేట్లపాలెం పరిసర గ్రామాలు భూకంపం వచ్చినట్లు కంపించాయి. సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలోని సామర్లకోట, పెద్దాపురం ప్రాంతాల వరకు పేలుడు శబ్దాలు వినిపించాయి. సమీపంలోని ఇళ్ల పైకప్పులు ఎగిరిపోవడమే కాకుండా, గోడలకు పగుళ్లు వచ్చాయి. భారీ శబ్దంతో గాల్లోకి ఎగిరిన రేకులు, శరీర భాగాలు చూసి స్థానికులు విలవిల్లాడిపోయారు. పచ్చని పొలాల మధ్య ఉన్న ఈ పరిశ్రమ క్షణాల్లో స్మశానవాటికను తలపించింది. ప్రమాదం జరిగిన తీరు అత్యంత భయంకరంగా ఉంది. కొందరు కార్మికులు మంటల నుంచి తప్పించుకోవడానికి పొలాల వైపు పరుగులు తీసినా, మార్గమధ్యలోనే కుప్పకూలి ప్రాణాలు విడిచారు. మృతదేహాలు పూర్తిగా కాలిపోవడంతో గుర్తుపట్టడం కష్టంగా మారింది. సాయంత్రం వరకు అధికారులు, సహాయక బృందాలు పొలాలు, కాలువల్లో గాలించి మృతదేహాలను ఒకచోటకు చేర్చారు. మృతుల్లో ఎక్కువ మంది వేట్లపాలెం, సామర్లకోట గ్రామాలకి చెందిన పేద కార్మికులే ఉండటం ఆయా గ్రామాల్లో విషాదాన్ని నింపింది. ఈ ఘోర దుర్ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధాని తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, పీఎంఎన్‌ఆర్‌ఎఫ్ నుంచి మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ మరియు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ కలెక్టర్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి కందుల దుర్గేష్‌ను ఘటనా స్థలానికి వెళ్లాలని ఆదేశించారు. ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటుందని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన భరోసా ఇచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన సానుభూతిని తెలియజేశారు. ఇటు ఏపీ మంత్రి లోకేశ్ స్పందిస్తూ.. ఇది మాటలకందని విషాదమని, బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రముఖ నాయకులు ఈ ఘటనపై స్పందిస్తూ ప్రాణనష్టం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి గల కారణాలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మృతుల కుటుంబాలకు తగిన పరిహారం ప్రకటించాలని, గాయపడిన వారికి ఉచితంగా అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందిస్తూ, బాణసంచా పేలుడులో చనిపోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ. 50 లక్షల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రమాద బాధితులకు తక్షణ సహాయక చర్యలు అందించడంలో ప్రభుత్వం వేగంగా స్పందించాలని కోరారు. కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మంత్రులు, ప్రజా ప్రతినిధులు పరామర్శించారు. ఆసుపత్రిలో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసి బాధితుల వివరాలను ఎప్పటికప్పుడు కుటుంబ సభ్యులకు తెలియజేస్తున్నారు. తమ వారు బతికున్నారో లేదో తెలియక కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్ద చేస్తున్న రోదనలు అందరినీ కలిచివేస్తున్నాయి.

# సైన్స్‌తోనే మానవ మనుగడ

**-మైనారిటీ గురుకుల ప్రిన్సిపాల్ డా. సురేష్ కుమార్**

**సిద్దిపేట టైమ్స్ ఇరుకుల్ల (కరీంనగర్)/ దౌల్తాబాద్:**

అదిమానవుడి నుంచి ఆధునిక మానవుడిగా మనిషి ఎదగడానికి ప్రధాన కారణం సైన్సేనని ఇరుకుల్ల మైనారిటీ గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ డా. కనపర్తి సురేష్ కుమార్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇరుకుల్ల మైనారిటీ గురుకుల పాఠశాలలో నిర్వహించిన సైన్స్ మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సైన్స్ ద్వారానే మానవుడు జ్ఞానం, వివేకం సంపాదించుకున్నాడని తెలిపారు. విద్యార్థుల్లో జిజ్ఞాసను పెంపొందిస్తే భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని అన్నారు. నిత్యజీవితంలో సైన్స్ లేకుండా మానవ మనుగడ కష్టమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్ కుమార్, శ్రీనివాస్, తిరుమల, శ్రవణ్, విష్ణు, శ్రీలత, అస్రా బాను, ఫార్హా, జూవేరియా, పవన్, అనిల్, వార్డెన్ పక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



## గాజులపల్లి ప్రాథమిక పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవ వేడుకలు



**సిద్దిపేట టైమ్స్ – దౌల్తాబాద్**

దౌల్తాబాద్ మండలంలోని గాజులపల్లి ప్రాథమిక పాఠశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు ప్రయోగాలు, ప్రాజెక్టు పనులతో ఆకట్టుకున్నారు. విద్యార్థులు రూపొందించిన విజ్ఞాన నమూనాలు అందరి ప్రశంసలు పొందాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు త్యాగరాజు, సీఆర్‌పీ గాడి రాజు, ఉపాధ్యాయులు నవీన్ రెడ్డి, నర్సింలు, జ్యోతి, స్రవంతి పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.పోటీల్లో మూడవ తరగతి విద్యార్థి పంజా ఇమాన్యుయల్ రూపొందించిన అగ్నిపర్వతం నమూనాకు మొదటి బహుమతి లభించగా, అన్విక, నిహస్విలు చేసిన నీటి చక్రం ప్రయోగానికి రెండవ బహుమతి దక్కింది.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు త్యాగరాజు మాట్లాడుతూ, విద్యార్థులు చిన్నప్పటి నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అలాగే జాతీయ విజ్ఞాన దినోత్సవ ప్రాముఖ్యతను వివరిస్తూ, దేశానికి విశేష సేవలందించిన సి.వి. రామన్ గారి కృషిని కొనియాడారు.సి.వి. రామన్ గారు రామన్ ప్రభావం అనే శాస్త్రీయ ఆవిష్కరణ ద్వారా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారని, ఈ పరిశోధనకు గాను ఆయనకు 1930 సంవత్సరంలో నోబెల్ బహుమతి లభించిందని తెలిపారు. భారతదేశంలో శాస్త్రీయ పరిశోధనలకు మార్గదర్శకుడిగా నిలిచిన ఆయన జీవితం విద్యార్థులకు ఆదర్శమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో విజ్ఞానశాస్త్రంపై ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

## ప్రాణం విలువ ఎంతో గొప్పది

**- ఎస్పి -శ్రీనివాస్ రావు**

**సిద్దిపేట టైమ్స్,తూప్రాన్ :-**

ప్రాణం విలువ ఎంతో గొప్పదని జిల్లా ఎస్పి శ్రీనివాస్ రావు అన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా మెదక్ జిల్లా పోలీస్ శాఖ చేపట్టిన అరైవ్ అలైవ్ రెండవ దశ కార్యక్రమంలో భాగంగా శనివారం తూప్రాన్ టోల్ గేట్ వద్ద జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ డి.వి. శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ అవగాహన సదస్సులో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, సీఐ రంగ కృష్ణ, నర్సాపూర్ సీఐ, తూప్రాన్ ఎస్ఐ గంగరాజు తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పోలీస్ శాఖతో పాటు సిఎంఆర్ మరియు పుష్పగిరి ఆసుపత్రుల వైద్య సిబ్బంది సహకారంతో ఉచిత వైద్య శిబిరం మరియు కంటి పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఆందోళనకరమని పేర్కొన్నారు. ముఖ్యంగా భారీ వాహన డ్రైవర్లు, స్కూల్ బస్సు డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు మరియు విద్యార్థులను ఉద్దేశించి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగించడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకపోవడం, వేగ పరిమితులను కచ్చితంగా పాటించడం, ట్రాఫిక్ నియమాలను అనుసరించడం వంటి అంశాలను స్పష్టంగా వివరించారు. అలాగే వాహనం నడిపేటప్పుడు మొబైల్ ఫోన్ వినియోగం ప్రమాదకరమని, మైనర్లు వాహనాలు నడపకూడదని హెచ్చరించారు. ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా రోడ్డు నియమాలను పాటిస్తేనే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. అనంతరం తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ మాట్లాడుతూ చాలా మంది విధి రాత వల్ల మరణించడం లేదని కేవలం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ముందు జాగ్రత్తలు తీసుకోకుండా, రోడ్డు సేఫ్టీ రూల్స్ పాటించకపోవడం తోనే చాలా మంది చనిపోతున్నారనేది యదార్థం అని అన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో వాహనదారులు, లారీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు హాజరై వైద్య శిబిరాన్ని వినియోగించుకున్నారు. ఆరోగ్య పరీక్షలు చేయించుకొని, రోడ్డు భద్రతపై సూచనలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం పెంపొందించడమే లక్ష్యమని తూప్రాన్ సిఐ రంగ కృష్ణ పేర్కొన్నారు. సురక్షిత ప్రయాణమే లక్ష్యం. నియమాల పాటనతోనే జీవితం సురక్షితం అనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో సీఐ సందీప్ రెడ్డి,ఎస్ఐ లు గంగరాజు,సుభాష్ గౌడ్, మధుకర్ రెడ్డి, జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ నిర్వాహకులు ఉపేందర్, కుడిపూడి శ్రీనివాస్, ఎన్. హెచ్.ఎ.ఐ మేనేజర్ రంగరాజు, సి.ఎం.ఆర్ హాస్పిటల్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ దుర్గా ప్రసాద్ రెడ్డి,ఎన్.ఐ.సి శాఖ అధికారి రవితేజ తదితరులు పాల్గొన్నారు.





## పట్టా పాస్‌బుక్ కలిగిన ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి

**- ఏ డి ఏ మల్లయ్య**

**సిద్దిపేట టైమ్స్, దౌల్తాబాద్:**

పట్టా పాస్‌బుక్ కలిగిన ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని దుబ్బాక డివిజన్ ఏడిఏ కాంపాటి మల్లయ్య తెలిపారు. శనివారం మండల పరిధిలోని గాజులపల్లి గ్రామంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమ ఆధార్ కార్డు ఆధార్‌కు సంధానించబడిన( చరవాణి) మొబైల్ ఫోన్‌తో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని సూచించారు. ఆధార్ ద్వారా దేశంలోని ప్రతి పౌరునికి గుర్తింపు ఇచ్చినట్లే, ప్రతి రైతుకు 11 అంకెలతో విశిష్ట సంఖ్య (యూనిక్ కోడ్) కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలని సంకల్పంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్ట్ ప్రారంభించబడిందని పేర్కొన్నారు. భూమి కలిగిన ప్రతి రైతు తన భూములకు సంబంధించిన వివరాలతో ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని తెలిపారు. అలాగే, పీఎం కిసాన్ లబ్ధిదారులు తదుపరి విడత లబ్ధి పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరి అని స్పష్టం చేశారు. దూర ప్రాంతాల్లో ఉన్న రైతులు సమీపంలోని సేవా కేంద్రాల్లో రిజిస్ట్రీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పంజ స్వామి, ఏఈవో సంతోష్ కుమార్, కార్యదర్శి హంసకేతన్ మరియు రైతులు పాల్గొన్నారు.





## లింగారెడ్డిపేట్ గ్రామంలో చిరుత కలకలం

**సిద్దిపేట టైమ్స్, మనోహరాబాద్ /తూప్రాన్ :-**

మనోహరాబాద్ మండలం లింగారెడ్డి పేట్ గ్రామంలో చిరుత సంచారం కలకలం రేపింది. శుక్రవారం రాత్రి గ్రామ శివారులో గ్రామానికి చెందిన రైతులు ఆకుల సుధాకర్, బామని ఐలయ్య ల యొక్క రెండు దూడలు శనివారం ఉదయం చనిపోయి ఉండడంతో పులి దాడి చేసిందని గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటన విషయం లో మనోహరాబాద్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి కి సమాచారం అందించిన్నట్లు సర్పంచ్ పెంటగౌడ్ తెలిపారు. అధికారులు సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని పులి దాడి చేసిందా లేక మరేదైనా జంతువు దాడి చేసిందా అనే కోణంలో విచారణ చేపట్టి అనవాళ్లను సేకరించారు.



## శ్రీ సాయి విద్యాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించబడింది

**సిద్దిపేట టైమ్స్, దౌల్తాబాద్:**

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలోని శ్రీ సాయి విద్యాలయం లో శనివారం సైన్స్ ఎగ్జిబిషన్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సాన రజిత మాట్లాడుతూ, మనం చేసే ప్రతి పనిలో సైన్స్ అంతర్లీనంగా ఉంటుందని, సైన్స్ లేకుండా ప్రపంచంలో ఏ పని జరగదని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకొని మంచి జ్ఞానాన్ని సంపాదించుకోవాలని సూచించారు. తదుపరి, పాఠశాల విద్యార్థులు సైన్స్ అంశాలపై ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పవిత్ర, శ్రావ్య, కవిత, సుజాత, స్వాతి, మేఘన తదితరులు పాల్గొన్నారు.



## దౌల్తాబాద్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవ ఉత్సవాలు



**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్:**

మండల కేంద్రమైన దౌల్తాబాద్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం ఘనంగా జరుపుకోబడింది. ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్ మాట్లాడుతూ, విజ్ఞాన శాస్త్రం మానవ జీవకోటికి ఎంతైనా అవసరమని, సైన్స్ లేనిదే జీవకోటి మనుగడ అసాధ్యమని తెలిపారు. నిజ జీవితంలో ప్రతి విద్యార్థికి సైన్స్ తోడ్పాటు ఉంటేనే ఆధునిక కాలంలో మనం సుస్థిరంగా జీవించగలమని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు, బహుమతుల పంపిణీ, పాఠశాల ఆవరణలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించబడింది. విద్యార్థులు రకరకాల ఆహార పదార్థాలను తయారుచేసి ప్రదర్శనలో భాగం అయ్యారు. కార్యక్రమంలో విద్యార్థులు ఆనందంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గోపాల్ రెడ్డి, సంజీవ్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, మహేష్ రెడ్డి, రవీందర్, విజయ్ కృష్ణ, మల్లేశం, శ్రీనివాస్ రెడ్డి, హరికృష్ణ, విష్ణుకుమార్, అంబిక్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి జిల్లాలో పోలీస్ యాక్ట్ 1861(30,30(ఎ ))అమలు

**- జిల్లా ఎస్పీడీవి శ్రీనివాసరావు**



సిద్ధిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి ఫిబ్రవరి 28 మెదక్ జిల్లా శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా మార్చ్ 01 నుండి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ - 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ. డి.వి. శ్రీనివాస రావు, తెలిపారు.ఈ సమయంలో పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఏవిధమైన ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని జిల్లా ఎస్పీ తెలిపారు. అలాగే ప్రజల/ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్టవ్యతిరేక చర్యలు, అశాంతి సృష్టించే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. శాంతి భద్రతల నిర్వహణలో ఎవరైనా విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసులు చేపడుతున్న చర్యలకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తక్షణమే తీసుకురావాలి



**-ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే జిఎంఆర్ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుల వినతి**

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**



న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తక్షణమే తీసుకురావాలని శుక్రవారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే, హైకోర్టు న్యాయవాది జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఆధ్వర్యంలో తెలంగాణలోని వివిధ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వినతిపత్రం అందజేశారు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి వచ్చే అసెంబ్లీ సమావేశాలలో ఈ బిల్లు పెడతామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అడ్వకేట్ ల తరపున ఎమ్మెల్యే జిఎంఆర్ కృతజ్ఞతలు తెలిపినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.


## అరకొర సిపిఎస్ పెన్షన్ తో బ్రతుకు భారం

**- రిటైర్మెంట్ తర్వాత గుదిబండగా మారనున్న వైద్య ఆరోగ్య ఖర్చులు**
**- ప్రభుత్వం ఉచిత ఆరోగ్య భద్రత కల్పించాలి**
**- తమ జీతాలనుండి 1.5% చందా వసూలు చేయడం దారుణం**
**- ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వ విడుదల స్పందించాలి**
**- తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కూరాకుల శ్రీనివాస్**



**సిద్దిపేట అర్బన్, సిద్దిపేట టైమ్స్,ఫిబ్రవరి28:**

అరకొర సిపిఎస్ పెన్షన్ తో రిటైర్మెంట్ తర్వాత బ్రతుకు భారంగ ఉంటుందని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కూరాకుల శ్రీనివాస్ అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఎస్ విధానం వల్ల రిటైర్మెంట్ తర్వాత వచ్చే నామమాత్ర పెన్షన్ తో వృద్ధాప్యంలో పూట గడపడమే కష్టంగా మారుతుందని ఇలాంటి దుస్థితిలో రిటైర్మెంట్ తర్వాత ఎలాంటి ఉచిత ఆరోగ్య భద్రత కల్పించకుండా ప్రస్తుతం తమ జీతాల నుండి 1.5% చందా వసూలు చేయడం దారుణం అని అన్నారు. పదవి విరమణ పొందిన ఉద్యోగులకు ఉచిత ఆరోగ్య బీమా సదుపాయం కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇస్తేనే బేసిక్ పే నుండి 1.5% మొత్తాన్ని కట్ చేయడానికి రాష్ట్రంలో 2.6 లక్షల సిపిఎస్ ఉద్యోగులు సమ్మతి తెలుపుతారని తెలిపారు. సిపిఎస్ సంఘం తరపున ప్రతినిధి లేకపోవడం వల్ల సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయురాలు సమస్యలు ప్రభుత్వానికి తెలియడం లేదని ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిశీలించి తగిన ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.



## ఎమ్మెల్యే జిఎంఆర్ దంపతులకు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల కృతజ్ఞతలు

**-ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్ దంపతులు**

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**



ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు శనివారం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) దంపతులకు ధన్యవాదాలు తెలిపారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని అడ్డాకుల మండలం రాచాల అనుబంధ గ్రామమైన నాగాయపల్లిలోని బోటుక సాయమ్మ, ఆంజనేయులుల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే జీఎంఆర్ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంటి యజమానులకు ఎమ్మెల్యే దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు తమ కుటుంబం తరపున ఎమ్మెల్యే జీఎంఆర్ దంపతులు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి, సొంతింటి కలను నిజం చేసిన ఎమ్మెల్యే జిఎంఆర్ దంపతులకు వారు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని మదనాపురం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద శనివారం లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజల ప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్ణయంతో గోవర్ధన్ నాయి హర్షం

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**



సర్పంచులకే అంగన్వాడి బాధ్యతలు అప్పగిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం బస్వాయిపల్లి గ్రామ ఉపసర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గోవర్ధన్ నాయి శనివారం హర్షం వ్యక్తపరిచారు. సర్పంచులకు కొత్త అధికారాలు కట్ట పెడుతూ కీలక నిర్ణయం తీసుకోవడం పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కారుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. గ్రామాల్లోని అంగన్వాడి కేంద్రాల పరిశీలు, వాటి బాగోగుల బాధ్యతలు సర్పంచులకు అప్పగిస్తూ ఈ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని ఆయన అన్నారు. నూతన సర్పంచులకు అధికారాలు అప్పగిస్తూ ఇటీవల ఉత్తర్వులు జా రీ చేయడం పై ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి లకు గోవర్ధన్ నాయి కృతజ్ఞతలు తెలిపారు.

# సంప్రదాయ పద్ధతిలో హోలీ పండుగ జరుపుకోవాలని నందబాల శర్మ సూచన

**సిద్దిపేట టైమ్స్, దౌల్తాబాద్:**



సిద్ధిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో ప్రముఖ పురోహితులు నంద బాల శర్మ శనివారం హోలీ పండుగ సందర్భంగా సాంప్రదాయ పద్ధతిలో పండుగను జరుపుకోవాలని సూచించారు.03032026 మంగళవారం జరగనున్న హోలీ పండుగ సందర్భంలో జాగ్రత్తలు పాటిస్తూ సాంప్రదాయ రంగులను ఉపయోగిస్తూ హోలీని జరుపుకోవాలని, రసాయనిక రంగులు వాడకుండా దైవ నామస్మరణ చేసుకోవాలని ఆయన సూచించారు. అలాగే, ఆ రోజు గ్రహణం జరుగుతున్నందున ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మాత్రమే పండుగను జరుపుకోవడం, గ్రహణం అనంతరం స్నానం చేసి పూజలు నిర్వహిస్తే పుణ్యం లభిస్తుందని, హోలీ ద్వారా సోదర భావం పెంపొందించుకోవచ్చని చెప్పారు. నందబాల శర్మ హోలీ పండుగ అందరి జీవితాల్లో కొత్త వెలుగులు విరజిల్లాలని ఆకాంక్షించారు.

# రజకులపై అఘాయిత్యాలపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య వ్యాఖ్యలపై రజక సంఘం తీవ్రస్థాయిలో ప్రతిక్రియా

**సిద్దిపేట టైమ్స్, దౌల్తాబాద్ :**



రజకులపై జరుగుతున్న అఘాయిత్యాలపై, రజక ఏకైక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య మరియు ఎమ్మెల్సీల వృత్తి విధానంపై రాష్ట్ర రజక సంఘం తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేసింది. సంఘం నాయకుడు ముత్యాల నర్సింహులు మాట్లాడుతూ, నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో జరిగిన దుర్ఘటనను రజకుల బాధితుల జీవితంపై అవమానకరంగా వ్యాఖ్యానించడం కేవలం ఒక జాతికి మాత్రమే కాదు, యావత్ తెలంగాణ సమాజాన్ని క్షోభించిందని అన్నారు. సరైన మానవత్వం లేకుండా, కృరత్వంతో మాటలు పలికే ఎమ్మెల్యే ప్రతీ అసహనం, రెండు నెలల పాప మరణాన్ని సహజ మరణంగా చెప్పడం, రజక జాతి పరంగా మరియు రాష్ట్ర సమాజంలో అవమానకరమని ఆయన గుర్తు చేశారు.రాజకీయ, వ్యక్తిగత లాభం కోసం పదవులను మాత్రమే ఆశించిన ఈ ఎమ్మెల్యే-ఎమ్మెల్సీ దంపతులు కుల సంక్షేమం కోసం ఏ చర్యలు తీసుకోలేదని, గత సెప్టెంబర్‌లో జరిగిన వీరానారి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో కూడా కేవలం 200 మంది పాల్గొనే విధంగా కుల పరంపరను అవమానించారని సంఘం ఆరోపించింది. ముత్యాల నర్సింహులు ఈ విషయాన్ని స్థిరమైన పోరాటానికి దారితీస్తామని, ఎమ్మెల్యే మరియు ఎమ్మెల్సీ రజకుల క్షమాపణ ప్రకటించేవరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు.



# కొమరవెల్లి దేవస్థాన ఈవో వెంకటేష్ పదవీ విరమణ

**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :**

కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థాన ఈవో టంక శాల వెంకటేష్ శనివారం పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రధాన కార్యాలయం హైదరాబాదులో ఆయనకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించగా కొమరవెల్లి ఆలయ ఏఈఓ రావుల సుదర్శన్, ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకుడు నీల శేఖర్, అర్చకులు సిబ్బంది ఆయనను గజమాలతో సన్మానించి స్వామివారి ప్రసాదాన్ని చిత్రపటాన్ని అందజేశారు.ఈ పదవి విరమణ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఆర్ జెసి రామకృష్ణారావు, డిసీలు శ్రీకాంతరావు, కృష్ణ ప్రసాద్, కొమురవెల్లి ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు ప్రవీణ్ యాదవ్, వంగరి వరలక్ష్మి నాగరాజు ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.







# ఘనంగా రాంసాగర్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ సంబరాలు

**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్**

జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని సిద్ధిపేట జిల్లా జెడ్పిహెచ్ఎస్ రామంసాగర్ పాఠశాలలో సివి రామన్ చిత్రపటాన్ని మెంతులతో వేశారు. వైజ్ఞానిక ప్రదర్శనలు,సైన్స్ గార్డెన్ వ్యాసరచన మరియు ఉపన్యాస పోటీలు రాంసాగర్ పాఠశాలలో నిర్వహించడం జరిగింది. జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని జెడ్పిహెచ్ఎస్ రామంసాగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రాజ్ కుమార్ నరేందర్ రెడ్డి సార్, మంజుల మేడం వారి యొక్క సందేశం ఇస్తూ భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులలో స్ఫూర్తిని నింపారు. పోటీలలో



గెలుపొందిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు గారిచే బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. జాతీయ సైన్స్ దినోత్సవం లో ఉపాధ్యాయ బృందం యాదయ్య , నవీన్ కుమార్, మహేష్, శ్యామ్ సుందర్ , సుజాత, అనిఫ్, ఉమా, సి ఆర్ పిస్వామి పాల్గొనడం జరిగింది.

# సైన్సు ఫలాలు సమాజానికి అందాలి

**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :**

సైన్స్ ఫలాలు సమాజానికి అందాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రతి పనిని ప్రయోగాత్మకంగా కాకుండా ప్రయోజనాత్మకంగా ఉండాలని మండలంలోని అర్జునపట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్ రెడ్డి అన్నారు. సైన్సు దినోత్సవాన్ని శనివారం పాఠశాలలో ఘనంగా నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. భావితరాలు ప్రతి విషయాన్ని పరిశీలించి పరిశోధించాలని ఎందుకు అనే ప్రశ్నతోనే విజ్ఞానం పెరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అబ్దుల్ కలాం, సివి రామన్ వివిధ శాస్త్రవేత్తల వేషధారణతో పాటు క్విజ్ వ్యాసరచన పోటీలను నిర్వహించగా పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కులకర్ణి, ఎమ్మార్ మూర్తి, సరిత, మల్లికార్జున్, షాదుల్లా విద్యార్థులు పాల్గొన్నారు.



## మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాలే వచ్చే ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో పునరావృతం అవుతాయి

**-దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్**

**-కొత్తకోట మున్సిపాలిటీ పాలకవర్గ పదవీ బాధ్యతల స్వీకరణ**

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**



జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల ఫలితాలే వచ్చే ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో పునరావృతం అవుతాయని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని కొత్తకోట మున్సిపాలిటీ పాలకవర్గ పదవి బాధ్యతల స్వీకారోత్సవ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ జడ్పీ చైర్మన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రసంగించారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి దేవరకద్ర నియోజకవర్గంలో అద్భుతమైన విజయాన్ని అందించిన కొత్తకోట మున్సిపాలిటీ ప్రజానీకానికి ఎమ్మెల్యే పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో మరోసారి రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ కష్టపడి పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. అనంతరం అనంతరం 9వ వార్డులో నూతన వాటర్ బోరును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే జిఎంఆర్ కు కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# శిరీష ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మున్సిపాలిటీ చైర్మన్

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలోని ఇందిరమ్మ ఇంటి లబ్ధి దారురాలు లాల్ కోట శిరీష ఇందిరమ్మ ఇంటిని శనివారం స్థానిక మున్సిపాలిటీ చైర్మన్ కొండ దమయంతి గోవర్ధన్ రెడ్డి దంపతులు ప్రారంభించారు. అలాగే లక్ష్మమ్మ, నరసింహల ఇందిరమ్మ ఇంటిని కూడా వారు ప్రారంభించారు. అలాగే ఇందిరమ్మ ఇంట్లో లబ్ధిదారులకు తమ కుటుంబం తరపున వారు నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి, సొంతింటి కల నెరవేర్చిన ఎమ్మెల్యే జిఎంఆర్ కు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోవర్ధన్ రెడ్డి, ఆది హనుమంత్ రెడ్డి, వీరప్పయ్య దేవస్థానం చైర్మన్ నరసింహారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ కురువ బీరప్ప, నర్వ శ్రీనివాసరెడ్డి, చెన్నప్ప లతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలి

**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :**

విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని నిజ జీవితంలో దాని అవసరాన్ని గుర్తించాలని మండలంలోని కడవేరుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజమణి అన్నారు. సైన్స్ దినోత్సవాన్ని శనివారం పాఠశాలలో ఘనంగా నిర్వహించగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలతో పాటు సైన్స్ చిత్రాలను చిత్రించే పోటీని నిర్వహించారు. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు రాజమణి విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేయగా కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, కృష్ణమూర్తి, చంద్రశేఖరరావు, రామకృష్ణ, లింగయ్య, కాంతి కృష్ణ, మమత, సజిదా, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.




## దౌల్తాబాద్‌లో ఉచిత వైద్య చెకప్ శిబిరం

సిద్ధిపేట టైమ్స్ దౌల్తాబాద్: నైనిత్ హాస్పిటల్ & హోమియో కేర్ ఆదివారం, 01032026న ఉచిత వైద్య చెకప్ శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఉదయం 9:00 నుండి మధ్యాహ్నం 3:00 వరకు జరిగే ఈ శిబిరంలో కంటి చెకప్ మరియు హోమియో చికిత్స ఉచితంగా అందించబడుతుంది. ఈ శిబిరంలో ఆర్ష మొలలు, షుగర్, రక్తపోటు, కిడ్నీలో రాళ్లు, కీళ్ల నొప్పులు తదితర సమస్యల పర్యవేక్షణ మరియు సలహాలు అందించబడతాయి. అలాగే, మందులు మరియు అద్దాలు సరసమైన ధరలకు పొందవచ్చు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.స్థలం: డాక్టర్ మహేష్ హోమియో క్లినిక్, అంబేద్కర్ చౌరస్తా, రాయంపేట్ రోడ్డు, దౌల్తాబాద్సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 8019419436/9381280703




# ఎంపీని మర్యాదపూర్వకంగా కలిసిన చేర్యాల కౌన్సిలర్లు

**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :**

భువనగిరి పార్లమెంటు సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డిని శనివారం హైదరాబాదులోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచిన చేర్యాల మున్సిపల్ కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు నకాషీ చిత్ర పెయింటింగ్ ను ఎంపీకి అందజేసిన సందర్భంగా ఎంపీ వారికి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలని కౌన్సిలర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు కౌన్సిలర్లు కొమ్ము రాజేశ్వరి నర్సింగరావు, పోతుగంటి ప్రసాద్, వెలుగల దుర్గయ్య, షరీఫా బేగం కాజా తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరించిన తహసిల్దార్ పి చంద్రశేఖర్

**సిద్దిపేట టైమ్స్,కోహెడ:**

సిద్ధిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయంలో ఈరోజు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆదేశాల మేరకు హుస్నాబాద్ డివిజన్ పరిధిలోని కోహెడ తహసిల్దార్ పి చంద్రశేఖర్ చేతుల మీదుగా తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ డైరీ,క్యాలెండర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బి ఎల్లయ్య,హుస్నాబాద్ డివిజన్ అధ్యక్షులు డి అరవింద్ కుమార్,ప్రధాన కార్యదర్శి జి సురేందర్,రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



https://siddipettimes.com
సిద్దిపేట టైమ్స్
తెలుగు దినపత్రిక


# మెదక్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మాడల్ ఐక్యరాజ్యసమితి

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి ఫిబ్రవరి 28**

మెదక్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈరోజు కలెక్ట రేట్ ఆడిటోరియంలో సోషల్ ఫోరమ్ సహకారంతో మాడల్ ఐక్యరాజ్యసమితి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలు గా అడిషనల్ కలెక్టర్ నగేష్, మెదక్ జిల్లా విద్యాధికారి విజయ, జెడ్పి సీఈవో ఎల్లయ్య, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుదర్శనమూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, హవెలి ఘనపూర్ ఎంఈఓ మధుమోహన్, సీఎమ్ఓ రాజు, ఏ ఎస్ ఓ నవీన్ హాజరయ్యారు. న్యాయ నిర్ణయతలుగా మెదక్ ఎంఈఓ శంకర్, ప్రధానోపాధ్యాయులు రఘు వర్ధన్ రెడ్డి, శ్రీనివాసరెడ్డిలు, చైర్మన్ రవిబాబు, వైస్ చైర్మన్ నర్సింలు, అనుసంధాన కర్తగా ప్రభాకర్, సూపర్వైజర్లు గా దేవి సింగ్, సత్యనారాయణ, ప్రసాద్ రెడ్డి, ప్రశాంత, భూలి బాయి, సంగీత, సుజాత వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లాలోని 28 పీఎం శ్రీ పాఠశాల నుండి ఇద్దరు ఇద్దరు విద్యార్థుల చొప్పున 56 దేశాల ప్రతినిధులుగా పాల్గొని, ఆ దేశాల తరపున చర్చలో పాల్గొనడం జరిగింది. 10 పాఠశాలల నుండి జర్నలిస్టుగా పదిమంది విద్యార్థులు వ్యవహరించారు. సమావేశంలో పాల్గొని ప్రసంగించినటు వంటి విద్యార్థులను 11 మందిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపడం జరిగింది ఏ ఎం ఓ సుదర్శనమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమం లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు చల్లా లక్ష్మణ్, స్వరూప రాణి, కిషన్ ప్రసాద్, లింగం తదితరులు పాల్గొన్నారు







# న్యాయవాదులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుంది

**- న్యాయవాదుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం.**
**- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, ఫిబ్రవరి 28**

న్యాయాన్ని రక్షించే న్యాయవాదులకు అండగా తెలంగాణ నిలుస్తుందని, న్యాయవాదుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో ముందుంటానని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర రాజధాని ఖైరతాబాద్ లోని ఇంజనీర్స్ ఇండియా భవనంలో ఐ ఎల్ పి ఎ జాతీయ అధ్యక్షురాలు సుజాత చౌదంటే అధ్యక్షతన శనివారం మహిళా న్యాయవాదుల రాష్ట్ర సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అవనిలో సగమైన మహిళలు అవకాశాల్లో సగం సాధించలేకపోతున్నారని, 70 ఏండ్ల స్వాతంత్ర భారత దేశంలో మహిళలపై వివక్ష కొనసాగుతూనే ఉందని ఫాతిమా ను జడ్జిగా నియమించిన సందర్భంలో కూడా విమర్శలు చేశారని అన్నారు. ఉన్నత విద్యార్హత, ఉత్తీర్ణతలు ఎన్ని ఉన్నా కులం, మతం, జెండర్ పేరుతో అవకాశాలకు దూరమవుతున్నారని అన్నారు. ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటూ న్యాయవ్యవస్థలో మహిళలు రాణిస్తున్నప్పటికీ చట్టపరమైన అవకాశాలు లేకపోవడంతో పాటు పురుషాధిక్య సమాజంలో న్యాయవాదులు, న్యాయమూర్తుల అభివృద్ధి జరగడం లేదని అన్నారు. ప్రజా ఉద్యమాలతో జీవితం ప్రారంభించి న్యాయవాదిగా వృత్తిని ప్రారంభించిన నేను నేడు చట్టసభల్లోకి ప్రవేశించి ఒక గౌరవప్రదమైన మంత్రి పదవి లో కొనసాగుతున్నానని అన్నారు. కొంతమంది రాజ్యాంగ వ్యతిరేకశక్తులు న్యాయ వ్యవస్థను తగ్గించి మాట్లాడుతున్నారని, ఆ విధానం మంచిది కాదని రాజ్యాంగం వల్లనే నాలాంటి వాళ్ళు ఈ స్థాయికి ఎదిగారని అన్నారు. రాజ్యాంగం నాకేమిచ్చిందని అనే వారికి నా జీవితమే సమాధానమని అన్నారు. న్యాయ వ్యవస్థ తెలియని సమాజానికి న్యాయం అందేలాగా, రాజ్యాంగ ఫలాలు సామాన్యులకు అందేలాగా చూడాలనీ అన్నారు. న్యాయవాద రక్షణ చట్టం తదితర అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇ తిరుమలదేవి మాట్లాడుతూ మహిళా న్యాయవాదులు న్యాయవాద వృత్తిలో రాణించాలంటే కుటుంబంతో పాటు సమాజం సహకారం అందించాలని, వచ్చిన అవకాశాలను కూడా ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలని అన్నారు. అన్ని శక్తులకన్నా స్త్రీ శక్తి గొప్పదని ఆ స్త్రీ సాధికారత కోసం ఇంకా మాట్లాడుకోవడం బాధాకరమని అన్నారు.




ఈ కార్యక్రమంలో పాల్గొన్న వినియోగదారుల రాష్ట్ర కమీషన్ చైర్ పర్సన్ జస్టిస్ జి రాధారాణి మాట్లాడుతూ మహిళా సమాజం న్యాయవాద విద్యలో ప్రావీణ్యం సాధిస్తూ, వృత్తిలో మెలుకువలు అభివృద్ధి చేసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భారత న్యాయ వ్యవస్థలో పితృస్వామ్య సమాజ ఆధిపత్యం కొనసాగుతుండటంతో చాలా అవకాశాలు కోల్పోతున్నారని ఐక్యతతో అవకాశాలు అందిపుచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐ ఎల్ పి ఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ న్యాయాన్ని కాపాడే న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందని, న్యాయవాదుల రక్షణ కోసం 1990 లోనే అంతర్జాతీయ స్థాయిలో జరిగిన కన్వెన్షన్ లో భారతదేశం కూడా పాల్గొన్నదని 35 ఏండ్ల తర్వాత కూడా భారత్ లో న్యాయవధ రక్షణ చట్టం తీసుకురాకోవడం దుర్మార్గమని అన్నారు. రాజస్థాన్, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాల్లో న్యాయవాదుల రక్షణ చట్టం ఏర్పాటు చేయడం జరిగిందని తెలంగాణతో పాటు దేశంలో న్యాయవాద రక్షణ చట్టం కోసం ఐ ఎల్ పి ఎ దేశ వ్యాప్త ఉద్యమం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇండియన్ డిఫెన్స్ అకౌంట్స్ సర్వీస్ రిటైర్డ్ అధికారి పి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ఉన్నత న్యాయ స్థానాల్లో మహిళలతో పాటు బహుజన న్యాయవాదులకు, న్యాయమూర్తులకు తీరని అన్యాయం జరుగుతుందని, ఈ వివక్షను ఎదుర్కోవడానికి మహిళా న్యాయవాదులు, బహుజన న్యాయవాదులు ఐక్యతతో పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన ఐ ఎల్ పి ఎ జాతీయ అధ్యక్షురాలు సుజాత చౌదంటే మాట్లాడుతూ తెలంగాణ మహిళా న్యాయవాదుల చైతన్యం గొప్పగా ఉందని, తరతరాల మహిళా వివక్షకు కారణమైన మనుధర్మ శాస్త్రం స్థానంలో అంబేద్కర్ అద్భుతమైన భారత రాజ్యాంగం అందించినప్పటికీ దాన్ని అమలుపరిచే భారత పాలకుల వల్ల మహిళలు అణచివేతకు గురవుతున్నారని, ఆ క్రమంలోనే మహిళా న్యాయవాదుల హక్కులు హరించివేయబడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐ ఎల్ పి ఎ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ జె శాంసన్, గౌరవ అధ్యక్షులు పొన్నం దేవరాజ్ గౌడ్, ఉపాధ్యక్షులు టి లక్ష్మీదేవి, తీగల జీవన్ గౌడ్, పూస మల్లేష్, కృష్ణారెడ్డి, పొడిచేటి శ్రీనివాస్, తౌడబోయిన రేణుక, హుస్న ఖాన్, ఎం సుమలత, ఆంధ్ర ప్రదేశ్ ఐ ఎల్ పి ఎ నాయకులు నూకతోటి రవి కుమార్, తెలంగాణ రాష్ట్ర ఐ ఎల్ పి ఎ నాయకులు చిల్ల రాజేంద్రప్రసాద్, గాంగేయుడు, డాక్టర్ తిప్పన్న డాంగే, కె సురేష్, భుజంగరావు, లతా ఆదోని, టి.హేమలత, జన్ను పద్మ, కెరీత్ కుమారి, గీతావనజాక్షి, మనీశ్వరి, జ్యోతి గరిగ, సామ హేమలత, ఎస్తేరు, స్వర్ణలత, సమత, పరశురాజ్, వి తిరుపతి, గుగులోతు బద్రు తదితరులు పాల్గొన్నారు.




# పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో కౌన్సిలర్లకు సన్మానం

**సిద్దిపేట్ టైమ్స్, దుబ్బాక ప్రతినిధి**

ఇటీవలే జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన లచ్చపేట 10 వ,11 వ వార్డుల నూతన కౌన్సిలర్లు బడుగు రాజు, నందాల శ్రీకాంత్ లను పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. శనివారం దుబ్బాక మున్సిపల్ పరిధి లచ్చపేట లోని శ్రీ శివ భక్త మార్కండేయ దేవాలయంలో వీరిని చేనేత కార్మికులు నేసిన శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ.. పద్మశాలీల అభ్యున్నతి కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సమాజం ఉపాధ్యక్షులు కారంపూరి మోహన్, కార్యదర్శి కూరపాటి వెంకటేష్, కోశాధికారి చెలిమెల్ల రాజేశం, కేబినెట్ మెంబర్లు వై. శ్రీనివాస్, తడక చిన్న దుబ్బయ్య, గౌరీనాథం, కొండ నారాయణ, మచ్చ గణేశం పలువురున్నారు.



## ఘనంగా మాజీ జెడ్పిటిసి జన్మదిన వేడుకలు..



**సిద్దిపేట్ టైమ్స్ రామాయంపేట ఫిబ్రవరి 28**

నిజాంపేట మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయ ఆవరణలో శనివారం తాజా మాజీ జెడ్పిటిసి పంజా విజయ్ కుమార్ జన్మదినం సందర్భంగా గ్రామ సర్పంచ్ చలిమేటి నరేందర్, ఉప సర్పంచ్ గేరిగంటి బాబు, ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ప్రశాంత్, గ్రామస్తులు చల్మేటి శివప్రసాద్, కిషోర్ గౌడ్, మల్లేశం, గరుగుల సుధాకర్, తిరుపతి, నవీన్, మహేష్, ప్రశాంత్, స్వామి, అరవింద్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మెదక్ ఆర్డీవో రమాదేవి



**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి ఫిబ్రవరి 28**

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించే క్రమంలో శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మెదక్ లో కొనసాగుతున్న పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షా హాళ్లలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పనితీరును, పరీక్షల నిర్వహణ విధానాన్ని నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు వివరాలను ఆరా తీశారు. నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోనే ప్రశ్నాపత్రాలను తెరిచారా లేదా అన్నది పరిశీలించారు. సీసీటీవీ నిఘా మధ్య ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నారా అనే విషయాన్ని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి సదుపాయం, మెడికల్ కిట్ తో ఏఎన్ఎం అందుబాటులో ఉండటం, టాయిలెట్ వసతులు వంటి మౌలిక సదుపాయాలను కూడా పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పరీక్షలు పూర్తైన వెంటనే ఆన్సర్ షీట్లను తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు సురక్షితంగా తరలించాలని సూచించారు. ఎలాంటి కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకతతో, పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని ఆర్ డి ఓ స్పష్టం చేశారు.



## నాలవ రోజు ప్రశాంతంగా ముగిసిన ఇంటర్మీడియట్ రెండవ సంవత్సర పరీక్షలు

**-ఇంటర్మీడియట్ విద్యాధికారి- మాధవి**

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి ఫిబ్రవరి 28**



శనివారం నాడు జరిగిన ఇంటర్మీడియట్ రెండవ సంవత్సర ఇంగ్లీష్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిసాయి. రెండవ సంవత్సర పరీక్షలలో జనరల్ విభాగం లో 4869 గాను 4799 విద్యార్థులు హాజరైనారు. ఒకేషనల్ విభాగంలో 540 గాను 525 విద్యార్థులు పరీక్షకు హాజరైనారు. జిల్లాలో నాలుగవ రోజు హాజరు శాతం 98.42 % గా నమోదైంది. ఈ సంవత్సరం ఐదు నిమిషాలు నిబంధన అమలు లో ఉండటంతో విద్యార్థులందరూ సమయానికి పరీక్షా కేంద్రాల కు చేరుకున్నారు. జిల్లాలో ఉన్న పరీక్షా కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మాధవి, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం పర్య వేక్షించారనీ ఒక ప్రకటనలో తెలిపారు.

# రామంతాపూర్ అటవీ ప్రాంతంలో జూదంపై టాస్క్ ఫోర్స్ దాడులు

**- 7 మంది అరెస్ట్ – రూ.24,070 నగదు, 9 మొబైల్ ఫోన్లు స్వాధీనం**
**- మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు**

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి ఫిబ్రవరి 28**

మెదక్ జిల్లా చేగుంట మండలం రామంతాపూర్ అటవీ ప్రాంతంలో బొమ్మా బోరుసు (జూదం) ఆడుతున్న వారిపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి 7 మందిని అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఆదేశాల మేరకు ఈ ఆపరేషన్ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రాజశేఖర రెడ్డి గారి ఆధ్వర్యంలో జూదం ఆడుతున్న వ్యక్తులపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 7 మంది జూదగాళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.24,070 నగదు మరియు 9 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిని నేరెళ్ల రాజు, మల్లా ప్రభాకర్, ఎలాగందుల నర్సింలు, సాయగౌడ్, కాబోజి ప్రవీణ్, వనం రాజు, ఉప్పాల నరేష్‌గా గుర్తించారు. వీరిలో చిట్టోజిపల్లి స్వామి, పోతులగూడ నరేష్, స్వామి, వల్లూరు రాజు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మిగిలిన నిందితులను చేగుంట పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పేకాట, బెట్టింగ్ వంటి అక్రమ చర్యల వల్ల అనేక కుటుంబాలు నష్టపోతున్నాయని, ముఖ్యంగా యువత ఇలాంటి చెడు మార్గాలకు దూరంగా ఉండాలని సూచించారు. అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించి సహకరించాలని ఆయన కోరారు.



## కొమురవెల్లి దేవస్థాన ఈవోగా కృష్ణ ప్రసాద్

**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :**

కొమురవెల్లి దేవస్థాన నూతన కార్య నిర్వహణ అధికారిగా డి. కృష్ణ ప్రసాద్ శనివారం నియమితులయ్యారు. కొమురవెల్లి దేవస్థాన ఈవోగా పని చేస్తున్న టంకశాల వెంకటేష్ శనివారం పదవి విరమణ పొందిన క్రమంలో ఆయన స్థానంలో కార్య నిర్వహణ అధికారిగా కృష్ణ ప్రసాదును నియమిస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాలు జారీ చేసినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.






## కొత్త కొత్త ఆలోచనలతోనే నూతన ఆవిష్కరణలు సాధ్యం..

**- ప్రతి ఒక్కరు శాస్త్రీయ దృక్పథం పట్ల అవగాహన పెంపొందించుకోవాలి... హెచ్ఎం బీ. రవీందర్**

**సిద్దిపేట టైమ్స్, దుబ్బాక ప్రతినిధి**

కొత్త కొత్త ఆలోచనలతోనే నూతన ఆవిష్కరణలు సాధ్యమవుతాయని, ప్రతి ఒక్కరు శాస్త్రీయ దృక్పథం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని హెచ్ఎం బీ .రవీందర్ అన్నారు. "జాతీయ సైన్స్ దినోత్సవం" సందర్భంగా శనివారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట జడ్పీ హెచ్ఎస్ లో పలువురు భారతీయ సైంటిస్టుల చిత్రపటాలను ప్రదర్శించారు. అమోనియా, వాటర్, మిథైన్, ఆమ్లాలు క్షారాలు, ధ్వని తరంగాలు, కాంతి పరావర్తన నియమాలు, కాంతివక్రీ భవనం వంటి అనేక ప్రయోగాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఫిజిక్స్, కెమిస్ట్రీ టీచర్ డాక్టర్ సాదత్ అలీ, బోటనీ టీచర్ కేవీకే చారి, అశోక్, ఉపాధ్యాయ బృందం, సీఆర్ పీ నవీన్ పలువురు పాల్గొన్నారు.



## మెదక్ జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలి

**- జిల్లాఇంచార్జి ,కార్మిక,గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి**

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి ఫిబ్రవరి 28**

మెదక్ జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలనీ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మంత్రి వివేక్ వెంకటస్వామి నీ సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో పుష్ప గుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. మెదక్ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలనీ, ప్రజాప్రభుత్వానికి మరింత మంచి పేరు తేవాలన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. తన శక్తి వంచనతో అహర్నిశలు పనిచేసి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెస్తామన్నారు.



## బీజేఆర్ సంఘం నూతన అధ్యక్షులుగా మోత్కుపల్లి భద్రయ్య

**సిద్దిపేట టైమ్స్, దుబ్బాక ప్రతినిధి**

పట్టణ బాబు జగ్జీవన్ రామ్ సంఘం (బీజేఆర్) నూతన అధ్యక్షులుగా మోత్కుపల్లి భద్రయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం మాజీ అధ్యక్షులు చెక్కపల్లి రాజమల్లు తెలిపారు. శనివారం సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణ కేంద్రం లోని బాబు జగ్జీవన్ రామ్ సంఘం లో నూతన అధ్యక్షులు భద్రయ్య, ఉపాధ్యక్షులు దొమ్మాట మల్లయ్య, కోశాధికారి బెల్లె రమేష్ లతో కూడిన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీజేఆర్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## చల్మెడ ప్రాథమికపాఠశాలలో స్వయంపాలన దినోత్సవం



**సిద్దిపేట్ టైమ్స్ రామయంపేట ఫిబ్రవరి 28**

నిజాంపేట మండల పరిధిలోగల చల్మెడ ప్రాథమిక పాఠశాలలో శనివారం నాడు స్వయంపాలన దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా 5వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులై పాఠశాల విధులను నిర్వహించారు. వీరిలో డీఈవోగా దీక్షిత్, ఎంఈఓ గా ప్రణవి, ప్రధానోపాధ్యాయులుగా వర్షిత్, పి ఈ టి గా వికాస్ మహిళా ఉపాధ్యాయులుగా చైత్ర, ప్రత్యూష ,ప్రణవి, శ్రీ వర్షిని, ఇందు, కీర్తన, అవంతిక ఉపాధ్యాయులుగా రేవంత్, ప్రణీత్, జతిన్, అయాన్ అటెండర్ గా ప్రణయ్ తమ విధులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సతీష్ కుమార్, ఉపాధ్యాయ బృందంలో మోహన్, మమత, నవీన్ రత్నాకర్, జ్యోతిలక్ష్మి, శ్రీలత, మమత తదితరులు పాల్గొని ఉపాధ్యాయులైన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు.

# పన్నులు పెంచడం... ప్రజలను ముంచడం...

**- ఢిల్లీ కి పంచడం కాంగ్రెస్ ప్రభుత్వం నైజం గా మారింది...**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, ఫిబ్రవరి 28**

పన్నులు పెంచడం, ప్రజలను దంచడం, ఢిల్లీకి పంచడం అన్న చందంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తుందని బి.ఆర్.ఎస్ నాయకులు పాల సాయిరాం, కోల రమేష్ గౌడ్, ఇర్షాద్ హుస్సేన్ అన్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బి.ఆర్.ఎస్ నాయకులు మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమం కోసం కాకుండా గాంధీ కుటుంబ సంక్షేమ కోసం పని చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అమలుకు సాధ్యం కానీ హామీలను ఇచ్చి ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రజల సొమ్ము అంతా ఢిల్లీకి జారవేస్తున్నారని మండిపడ్డారు. అది సరిపోక పోగా రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 10 ద్వారా అన్ని రకాల వాహనాలపై పన్నులు పెంచి ప్రజలపై మరింత పన్నుల భారం వేస్తోందన్నారు. ఈ వెహికిల్ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో ప్రజల పక్షంగా పోరాటం చేస్తామని తెలిపారు. అలాగే షాపుల్లో లేని యూరియా యాపుల్లో ఎలా ఉంటుందని..... రైతులను ఇబ్బందులకు గురి చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ యాప్లను తీసుకువస్తుందని దుయ్యబట్టారు. అధికారంలోకి రావడానికి సాధ్యం కానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చేంతవరకు టిఆర్ఎస్ ఊరుకోదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు గ్యార శ్రీనివాస్, సర్పంచ్ రమేష్, చాంద్ పాషా, చింటూ, ఇమ్రాన్,సాయి చరణ్ పలువురు పాల్గొన్నారు.



# చిన్నారులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలి ... సర్పంచ్ కొంగరి కనకవ్వ

**సిద్దిపేట టైమ్స్, దుబ్బాక**

అంగన్వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలని సర్పంచ్ కొంగరి కనకవ్వ రాజయ్య అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లాదుబ్బాక మండల పరిధిలోని బల్వంతాపూర్ అంగన్వాడీ కేంద్రం(తిమ్మాపూర్ సెక్టార్)లో నిర్వహించిన అక్షరాభ్యాస కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె.. మూడేళ్లు నిండిన చిన్నారులకు పలక బలపం పట్టి అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్వైజర్ స్వరూప.. 'ఈసీసీఈ డే' కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి లో జరిగిన కార్యక్రమాలను వివరించారు . అనంతరం చిన్నారులకు పలకల (స్లేట్) ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ హరిత, పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎం వందన, ఎంఎల్ హెచ్ పీ స్రవంతి, అంగన్వాడీ టీచర్ పుష్పలత, ఆశాలు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.



# పదేండ్ల బాలికకు అరుదైన వ్యాధి..

**- బోన్ మ్యారో ఎప్లాస్టిక్ అనీమియాతో బాధపడుతున్న శ్రీనిధి..**
**- చికిత్సకు ఇప్పటివరకు రూ.8లక్షల వరకు ఖర్చు**
**- ఇంకా రూ.20లక్షలు ఖర్చవుతుందన్న డాక్టర్లు**
**- మనసున్న మహారాజులు ఆదుకోవాలని తల్లిదండ్రుల వేడుకోలు**

**సిద్దిపేట టైమ్స్, అక్బర్ పేట-భూంపల్లి, ఫిబ్రవరి 28**



అక్బర్ పేటభూంపల్లి మండలం రుద్రారం గ్రామానికి చెందిన ఓ నిరుపేద కుటుంబం ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది. గ్రామానికి చెందిన బిట్ల పర్శరాములుగీతా దంపతుల కూతురు శ్రీనిధి (10) గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. చలాకీగా ఉండే శ్రీనిధి గత ఐదు నెలలుగా బోన్ మ్యారో ఎప్లాస్టిక్ అనీమియా అనే అరుదైన వ్యాధితో బాధపడుతోంది. డాక్టర్ల సూచన మేరకు తల్లిదండ్రులు హైదరాబాద్ లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. చికిత్సకు అవసరమైన ఏటీజీ ఇంజక్షన్ ఇచ్చినప్పటికీ 4నెలలుగా ఎలాంటి ఇంప్రూవ్ మెంట్ కనిపించలేదు. చికిత్స కోసం ఇప్పటి వరకు రూ.7నుంచి 8లక్షలు ఖర్చు అయ్యాయి. స్తోమతకు మించి ఖర్చులు కావడంతో పర్శరాములు తనకున్న 18గుంటల భూమి కూడా అమ్మాడు. కాగా డాక్టర్లు తప్పనిసరిగా బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంట్ చేయాలని సూచించారు. బాలిక వెన్నుపూస గుజ్జు అభివృద్ధి చెందకు పోవడంతో బోన్ మ్యారో ట్రాన్స్ ప్లాంట్ చికిత్సకు సంబంధించి డోనర్ కోసం కండ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. చికిత్సకు దాదాపు రూ.20లక్షల వరకు ఖర్చవుతుందని మనసున్న మహారాజులు ముందుకొచ్చి ఆర్థికసాయం అందించాలని వేడుకుంటున్నారు. తమ కూతురు ప్రాణాలు కాపాడాలని దీనంగా అభ్యర్థిస్తున్నారు. 9652210740 నెంబర్ కు ఫోన్ పే, గూగుల్ పే చేయాలని కోరారు. ఇదిలా ఉండగా బాలిక అనారోగ్య విషయం తెలుసుకున్న సిద్దిపేటకు చెందిన హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులు తమవంతుగా రూ.10వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా బాలిక తల్లిదండ్రులు సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



# ఘనపూర్ లో సైన్స్ దినోత్సవ సంబురాలు

**సిద్దిపేట టైమ్స్ పిబ్రవరి 28:**

తొగుట మండలం ఘనపూర్ ఉన్నత పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ సంబురాలు నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో సైన్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శించడంతో పాటుగా విద్యార్థులకు ఉపన్యాస పోటీలు, ఎస్సే కాంపిటీషన్, క్విజ్ కాంపిటీషన్ లను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు అంజలి గారు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు

# విస్తృత అవకాశాలుగల కోర్సు 'కామర్స్'

**సిద్దిపేట టైమ్స్,హైదరాబాద్, ఫిబ్రవరి 28:**

నేటి పారిశ్రామిక ప్రపంచంలో సరళీకృత ఆర్థిక విధానాల ద్వారా 'కామర్స్' విస్తృత అవకాశాలు గల రంగంగా ప్రాధాన్యతను సంతరించుకుందని ఉస్మానియా యూనివర్సిటి కామర్స్ విభాగం డీన్ ప్రొఫెసర్, డాక్టర్ కె. క్రిష్ణచైతన్య అన్నారు. నారాయణగూడ లోని జాగృతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శనివారం కామర్జియా పేరుతో నిర్వహించిన కామర్స్ ఫెస్ట్ 2026 ను ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆధునిక వాణిజ్య రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పుల గురించి విద్యార్థులు తయారు చేసి, ప్రదర్శించిన వివిధ నమూనాలు, ప్రాజెక్టులను తిలకించి, విద్యార్థులను ఆయా ప్రాజెక్టుల గురించి ప్రశ్నించి, పలు సూచనాలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామర్స్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని, ప్రపంచవ్యాప్తంగా మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని అన్నారు. కామర్స్ విద్యార్థులు తమ నైపుణ్యతను ప్రదర్శించి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆయన సూచించారు. నేటి ఆధునిక కాలంలో కామర్స్ కోర్సులకు మంచి గుర్తింపు ఉందని, విద్యార్థులు కష్టపడి చదివి, విజ్ఞానాన్ని పెంపొందించుకుంటే, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కొదువ లేదు అని తెలిపారు. కళాశాల చైర్మన్ డాక్టర్ ఓ. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తమ కాలేజీ నాణ్యమైన విద్యకు, విద్యార్థుల ప్రగతికి ఎంతో కృషి చేస్తుందని చెప్పారు. ప్రిన్సిపాల్ జోసెఫిన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తరగతులకు హాజరు అయి రాబోయే పరీక్షల్లో మెరిట్ సాధించి, ఉత్తీర్ణత శాతం పెంచుకోవాలని సూచించారు. కళాశాల సెక్రటరీ శశికిరణ్ రెడ్డి మాట్లాడుతూ కాలేజీ లో విద్యార్థుల నైపుణ్యాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన తరగతులకు తప్పకుండా హాజరు కావాలని, ఉద్యోగ నియామకాల కోసం చాలా బహుళ జాతీయ కంపెనీలు తమ కాలేజీకి రాబోతున్నాయని తెలిపారు.



వైస్ ప్రిన్సిపల్ మధుసూదన్ ప్రసంగిస్తూ విద్యార్థులు వాణిజ్య రంగంలో వస్తున్న మార్పులను గమనించి, పరిశ్రమకు సంబంధించిన ఆధునిక అంశాల పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. భారత్ దర్శన్ పేరిట పలు రాష్ట్రాల సాంస్కృతిక, వాణిజ్య ప్రాముఖ్యతను తెలియ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రాముఖ్యతను తెలియ చేస్తూ బి. కాం తృతీయ సంవత్సరం విద్యార్థులు ప్రదర్శించిన పార్లమెంట్ సమావేశం ప్రదర్శన ఆహుతులను మంత్ర ముగ్ధులను హైచేసింది. ఈ కార్యక్రమంలో కళాశాల బిఎస్.సి ఇంచార్జి సంతోష్ రెడ్డి, అధ్యాపక బృందం, అడ్మిన్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



**సిద్దిపేట టైమ్స్ తొగుట పిబ్రవరి 28:**

పదవ తరగతి పరీక్ష లు రాబోతున్న సందర్భంగా తుక్కాపూర్ గ్రామానికి చెందిన నెవురి కరుణాకర్ రెడ్డి పరీక్షలు రాయడానికి ఇబ్బందికరంగా ఉండకూడదని ఉద్దేశంతో తన గ్రామానికి చెందిన పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ ని పెన్నులను అందించారు. కార్యక్రమంలో భాగంగా 600 మార్కులకు 600 సాధించాలని ఉద్దేశంతో ప్రతి ఒక్క విద్యార్థికి ప్రోత్సాహపరుస్తూ 600 మార్కులకు 500 పైగా మార్కులకు సాధించిన విద్యార్థులకు ప్రైజ్ మనీ ఇస్తానని హామీ ఇచ్చాడు.మొదటి బహుమతిగా 5000 రూపాయలను,రెండవ బహుమతిగా 3000 రూపాయలు,మూడవ బహుమతిగా 2000 రూపాయలు ప్రకటించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు గోపనీ రమేష్. దూలం శంకర్, డాక్టర్ స్వామి,బర్రెంకల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# భూ రికార్డుల పై యాజమాన్యులకు భరోసా కల్పించేలా లైసెన్స్ సర్వేయర్ లు పని చేయాలీ..

**- జిల్లా కలెక్టర్ కె. హైమావతి**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, పిబ్రవరి 28:**

భూ రికార్డుల పై రైతులకు, యాజమాన్యులకు భరోసా కల్పించేలా లైసెన్స్ సర్వేయర్ లు పని చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హల్ లో శిక్షణ పూర్తి చేసుకున్న 110 మంది సర్వేయర్లకు ధృవీకరణ లైసెన్స్ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రజల ఆశయాలకు అనుగుణంగా పని చేస్తూ పేద ప్రజల కష్టాలను తొలగించేందుకు రైతులకు చుట్టంగా ఉండే విధంగా అద్భుతమైన భూ భారతి చట్టం ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు.రెండవ విడతలో సర్వేయర్ అభ్యర్థులకు శిక్షణ అందించి పరీక్షలు ఆధారంగా ఉత్తీర్ణత సాధించి జిల్లాలో అర్హత సంపాదించిన 110 మంది అభ్యర్థులకు లైసెన్సులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. లైసెన్స్ సర్వేయర్ లను మండలాల వారీగా అందుబాటులో ఉన్న భూమి ఆధారంగా అలాట్మెంట్ చేస్తామని అన్నారు.భూములు ఉన్న రైతులకు భరోసా కల్పించే భూ భారతి చట్టం అమలు కోసం సర్వేయర్ లకు ఆధునిక సాంకేతిక వినియోగించేందుకు సామాగ్రి ప్రభుత్వం పంపిణీ చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సర్వే ల్యాండ్ సుదర్శన్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.






# అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

**సిద్దిపేట టైమ్స్ తొగుట పిబ్రవరి 28:**

తొగుట మండలంలోని జప్తీ లింగారెడ్డిపల్లె గ్రామంలో యెన్నం నాగవ్వ కిష్టారెడ్డి గారి నూతన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ నాడు నేడు పేదవాడికి ఇళ్లు అందించడమే కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన లక్ష్యం అని విడతలవారీగా నియోజకవర్గంలో ఇల్లు లేని పేదవాడు లేకుండా చూడటమే కర్తవ్యం అని తెలియజేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి (అమర్), మండల పార్టీ అధ్యక్షులు అక్కం స్వామి,సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పిట్ల సత్తయ్య, గౌరవ సర్పంచ్లు కనకయ్య, పాగల శోభా కొండల్ రెడ్డి,గొడుగు జయమ్మ నర్సింలు,ఆత్మ కమిటీ డైరెక్టర్లు ప్రవీణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బిక్షపతి ,చందా సత్తయ్య,గ్రామ పార్టీ అధ్యక్షులు కొండల్ రెడ్డి, సీనియర్ నాయకులు యేన్నం భూపాల్ రెడ్డి,బుస నిరంజన్ రెడ్డి,పంది రాజు, బండారు రమేష్ గౌడ్,సోలిపేట ప్రసాద్ రెడ్డి,బక్కన్న గారి సంపత్ రెడ్డి, మహ్మద్ షఫీ,స్వామి గౌడ్,చందా రవి,బాలరాజు,తిరుమలూ ఆంజనేయులు,తదితరులు పాల్గొన్నారు.....



# సీసీ కెమెరాల ఏర్పాటు తో రక్షణ

**సిద్దిపేట టైమ్స్,తూప్రాన్ :-**

సీసీ కెమెరాల ఏర్పాటు తో రక్షణగా ఉంటుందని మున్సిపల్ కౌన్సిలర్ రాథోడ్ జైపాల్ అన్నారు. శనివారం తూప్రాన్ పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో తన స్వంత నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సహచర కౌన్సిలర్ లతో కలిసి ప్రారంభించారు.అనంతరం సి.వి. రామన్ జయంతి , జాతీయ సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి భావి భారత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి దిశగా సాగుతున్నాయని తెలిపారు. ఒకప్పుడు 140 మంది మాత్రమే ఉన్న విద్యార్థుల సంఖ్యను 400 దాటేలా చేర్పులు పెంచి, నాణ్యమైన విద్య అందించే దిశగా కృషి చేస్తున్నారని ప్రధానోపాధ్యాయులు ను ప్రశంసించారు. సలాక రాజేశ్వర శర్మ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలోనే మార్గ దర్శకత్వం లభిస్తే విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలమవుతుందని అన్నారు. ఉపాధ్యాయుల సేవాభావం విద్యార్థులకు అదృష్టమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల విద్యార్థుల భద్రత పెరగడమే కాకుండా, క్రమశిక్షణా వాతవరం ఏర్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్ గౌడ్, కాశిరెడ్డి,ఉపాధ్యాయులు అమరవాణి, జ్యోతి.దుర్గా, వనిత,శ్రీవాణి,రజిత,పద్మ, నుస్రత్,నరేష్ రెడ్డి, తిరుమల తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి...

**కౌన్సిలర్ మూర్తి సంధ్యారాణి**

**సిద్దిపేట టైమ్స్, దుబ్బాక**

ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ మూర్తి సంధ్యారాణి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శనివారం దుబ్బాక మున్సిపల్ పరిధి చేర్వాపూర్ 6 వ వార్డులోని అంగన్వాడీ కేంద్రంలో కౌన్సిలర్ మూర్తి సంధ్యారాణి శ్రీనివాస్ రెడ్డి దంపతులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం వారు అంగన్వాడీ కేంద్రం వద్ద పండ్ల మొక్కలను నాటారు. అంగన్వాడీ కేంద్రంలో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు తప్పక అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ మద్దుల సత్యలక్ష్మి, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు పుర్మ గోవర్ధన్ రెడ్డి, మూర్తి నరేష్ రెడ్డి పలువురున్నారు.



# విద్యా కమిషన్ రిపోర్టును వ్యతిరేకించిన ప్రభుత్వ ఉపాధ్యాయులు

**- నల్ల బ్యాడ్జీలతో నిరసన..**

**సిద్దిపేట టైమ్స్ హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గ్రామం**

హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల పట్ల సమాజంలో చులకనగా భావించి ప్రభుత్వానికి విద్యా కమిషన్ రిపోర్ట్ అందించిన దానికి నిరసనగా నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయులు నిరసన తెలియజేశారు.ఈ రిపోర్ట్ తయారుచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయులను కించపరిచిన వాటిని వెనక్కి తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ టియు మండల అధ్యక్షుడు కొలుగూరి తిరుపతిరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు లింగారెడ్డి, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు మహేందర్ , తిరుపతి, వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాస్, రమా దేవి , కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలి..

**- హైకోర్టు న్యాయమూర్తి,జిల్లా అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి జస్టిస్ పుల్లా కార్తీక్**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, పిబ్రవరి 28:**

పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి,జిల్లా అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి జస్టిస్ పుల్లా కార్తీక్ సూచించారు. శనివారం జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ పుల్లా కార్తీక్ సిద్దిపేట జిల్లా కోర్టుకు రాగ జిల్లా జడ్జ్ సాయి రమాదేవి,ఇతర న్యాయమూర్తులు స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ గౌరవ వందనం స్వీకరించి కోర్టు హాల్లో ఏర్పాటు చేసిన జ్యుడీషియల్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ లో పాల్గొని జిల్లాలో వివిధ కేసుల డిస్పోజల్ పెండింగ్ కేసుల పై న్యాయమూర్తులు,న్యాయ సిబ్బందిచే సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు న్యాయశాఖ పనిచేస్తుందని జిల్లాలో వివిధ కేసులలో వచ్చే కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. అదేవిధంగా పెండింగ్ కేసులు లేకుండా ఎప్పటికప్పుడు డిస్పోజట్ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి కే. సాయి రమాదేవి, అదనపు జిల్లా జడ్జి వై.జయప్రసాద్, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి సంతోష్ కుమార్ మరియు మిగతా జిల్లా న్యాయమూర్తులు, ఏవో సుల్తాన్ ఆసిఫ్ ఇక్బాల్, వై.రవీందర్, మిగతా సిబ్బంది పోలీస్ అధికారులు, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు సిహెచ్ జనార్దన్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ తాటికొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## పేట మున్సిపల్ కమిషనర్ గా గణేష్ రెడ్డి

**సిద్దిపేట్ టైమ్స్ రామాయంపేట ఫిబ్రవరి 28**



మెదక్ జిల్లా రామాయంపేట ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ గా తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి శనివారం నాడు పదవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో మున్సిపల్ కమిషనర్ గా విధులు నిర్వహించిన దేవేందర్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నందున జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గణేష్ రెడ్డికి రామాయంపేట ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్ గా అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి మాట్లాడుతూ రామాయంపేట మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని అన్నారు.



## దేవరకద్రలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో శనివారం రాత్రి దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇండ్ల లబ్ధిదారులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## తహసిల్దార్ కార్యాలయంలో ఇసుక బహిరంగ వేలం

**సిద్దిపేట్ టైమ్స్ రామాయంపేట ఫిబ్రవరి 28**

రామాయంపేట మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం వద్ద శనివారం నాడు ఇసుక బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఆశవాహులు ఈ వేలం పాటలో పాల్గొన్నారు. ఇటీవల స్వాధీనం చేసుకున్న పాదాలు ట్రాక్టర్ల ఇసుక బహిరంగ వేలంపాట నిర్వహించగా 8 మంది ఇసుక వ్యాపారులు ఈ వేలంపాటలో పాల్గొన్నారు. బహిరంగ వేలంలో రూ 43 వేల కు స్థానిక ఇసుక వ్యాపారి మల్లారెడ్డి ఇసుకను వేలంపాటలో దక్కించుకున్నట్లు డిప్యూటీ తహసిల్దార్ నవీన్ కుమార్ తెలిపారు. ఈ వేలంపాట కార్యక్రమంలో ఆ రైలు మమ్మద్ గౌస్, గోపీలు తదితరులు పాల్గొన్నారు



## ప్రజలందరికీ సమాన హక్కులు ఉండాలి..

**- మండపల్లిలో ఘనంగా పౌర హక్కుల దినోత్సవం**

**సిద్దిపేట టైమ్స్,సిద్దిపేట , ఫిబ్రవరి 28:**

ప్రజలందరూ రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, సమాజంలో అస్పృశ్యత నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిద్దిపేట ఇన్‌స్పెక్టర్లు పిలుపునిచ్చారు. శనివారం సిద్దిపేట జిల్లా పరిధిలోని మందపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిద్దిపేట టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ హాజరై మాట్లాడారు. గ్రామంలో కుల వివక్షకు తావు లేకుండా, అందరూ సోదరభావంతో మెలగాలని సూచించారు. చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండటం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వి. కరుణాకర్ (జీపీఓ, మందపల్లి)భవానీ (పంచాయతీ కార్యదర్శి)బర్రె కిష్టయ్య (ఉప సర్పంచ్)గ్రామ వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజల్లో శాస్త్రీయ చైతన్యాన్ని కలిగించాలి

**-తగిరెడ్డి దేశి రెడ్డి, నంగునూరు మండలం విద్యాధికారి**



సిద్దిపేట టైమ్స్, నంగునూరు, ఫిబ్రవరి 28: విద్యార్థులు ప్రజలు శాస్త్రీయ చైతన్యం కలిగించాలని నంగునూరు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశి రెడ్డి సూచించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా వివిధ అంశాల్లో విద్యార్థులు ప్రదర్శనలు వీక్షకులను అలరించాయి. సేంద్రియ వ్యవసాయం, భూకంప అలారం, పంటల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ తదితర 36 ప్రదర్శించి వివిధ అంశాల్లో విద్యార్థులు బహుమతులు గెలుపొందారు. పాఠశాలలో నమూనా వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులు డాక్టర్లు(కార్డియాలజిస్ట్ , గైనకాలజిస్ట్, డెర్మటాలజిస్ట్)గా వ్యవహరించి వివిధ (రక్త పరీక్షలు) నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని సిద్దిపేట వైద్యురాలు రాచకొండ సాయిశ్రీ సందర్శించి విద్యార్థులను అభినందించారు. ఆడపిల్లల్లో వచ్చే జబ్బులు పరిశుభ్రత ప్రధాన్యత పై మార్గదర్శనం చేశారు. నర్మెట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుని ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ ప్రజా చైతన్యకార్యక్రమాలు నిర్వహిస్తున్న బి.ప్రశాంత్ నిత్యజీవితంలో సైన్స్ ప్రాధాన్యత అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి తగిరెడ్డి దేశి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి అంశాన్ని శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషిస్తూ సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలను నిర్మూలించేందుకు పాటుపడాలని కోరారు సైన్స్ మానవ జీవితాన్ని సుఖమయం చేస్తుందని తెలిపారు. శాస్త్రీయ దృక్పథాన్ని విద్యార్థులకు పాఠశాల స్థాయి నుండే అందిస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో చిన్నారి తొమ్మిదవ తరగతి విద్యార్థిని గోడెపు కారుణ్య సీ వీ రామన్ వేశ ధారణలో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, సైన్స్ ఉపాధ్యాయులు గణపతి, కనకయ్య. మన్మోహన్ రెడ్డి, త్రివిక్రమ్ శర్మ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎమ్మార్వో రజనీకుమారి

**సిద్దిపేట టైమ్స్ రామాయంపేట ఫిబ్రవరి 28**



రామయంపేట మున్సిపాలిటీలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ పరీక్షల కేంద్రాన్ని శనివారం నాడు స్థానిక ఎమ్మార్వో రజిని కుమారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలో మౌలిక వసతులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరీక్షలకు హాజరైన విద్యార్థిని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వైద్య సిబ్బందిని తాగునీటి సదుపాయాన్ని అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షా కేంద్రంలో ఏర్పాట్ల పట్ల ఆమె సంతృప్తిని వ్యక్తం చేశారు. సిబ్బందిని అభినందించారు

# ఘనంగా ముగిసిన 'కమిషనరేట్ ఛాంపియన్స్ లీగ్ - 2026'.. విజేతలకు బహుమతులు అందజేసిన పోలీస్ కమిషనర్

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, ఫిబ్రవరి 28**





సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బంది యొక్క పని ఒత్తిడిని తగ్గించి, వారిలో ఉత్సాహాన్ని, క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు నిర్వహించిన 'కమిషనరేట్ ఛాంపియన్స్ లీగ్ 2026' క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ముఖ్య అతిథిగా హాజరై, ఈ ఏడాది క్రీడల ముగింపును అధికారికంగా ప్రకటించారు.గత కొన్ని రోజులుగా జరిగిన ఈ ఛాంపియన్స్ లీగ్‌లో కమిషనరేట్ పరిధిలోని వివిధ విభాగాల నుండి క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో ప్రధానంగా:క్రికెట్ & వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, బ్యాడ్మింటన్, రన్నింగ్ ఈవెంట్స్, షాట్‌పుట్ & లాంగ్ జంప్ వంటి క్రీడల్లో సిబ్బంది తమ ప్రతిభను చాటుకున్నారు. ముగింపు వేడుకల్లో భాగంగా, వివిధ క్రీడల్లో విజేతలుగా నిలిచిన జట్లకు మరియు వ్యక్తిగత విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి పోలీస్ కమిషనర్ ట్రోఫీలు అందజేశారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. "నిరంతరం ప్రజల రక్షణలో ఉండే పోలీసులు శారీరక దారుఢ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని కలిగి ఉండటం చాలా అవసరం. క్రీడలు క్రమశిక్షణను, జట్టు స్ఫూర్తిని నేర్పుతాయి, విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించేందుకు ఇలాంటి క్రీడలు దోహదపడతాయి" అని పేర్కొన్నారు. ప్రతి ఏటా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు, సీఐలు, ఆర్ఐలు మరియు కమిషనరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## వృక్షాలను దేవతల గా భావించి కాపాడుకోవాలి

గొట్టిపర్తి రామస్వామి గౌడ్, ప్రధానోపాధ్యాయుడు, నంగునూరు ఉన్నత పాఠశాల కాంప్లెక్స్

సిద్దిపేట టైమ్స్, నంగునూరు, ఫిబ్రవరి 28: వృక్షాలను దేవతలుగా భావించి కాపాడుకోవాలని నంగునూరు ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామిగౌడ్ అన్నారు. నంగునూరులోనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న రావి చెట్టును శనివారం మదర్ ట్రీ (మాతృ వృక్షం అంటే చెట్టమ్మ)గా ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గొట్టిపర్తి రామస్వామి మాట్లాడుతూ ప్రకృతిని కాపాడితే మనలను కాపాడుతుందని చెప్పారు. ప్రకృతిని విధ్వంసం చేయడం వల్ల పర్యావరణ సమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. ప్రాచీన కాలంలో వృక్షాలను దైవాలుగా భావించడం వల్లనే ప్రాచీన సమాజం మనుగడ సాగించిందని చెప్పారు. వృక్షాలను కాపాడకపోవడం వలన పర్యావరణ సమతుల్యత దెబ్బతిని విపరీత పరిణామాలకు దారి తీస్తోందన్నారు. ఈ కార్యక్రమం పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు దుబ్బుడు రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు గిరి తిరుపతి, వై.రామ గోపాల్ రెడ్డి, జి కన్యాలాల్, కొత్తపల్లి రవి, వంశీకృష్ణ, ఎం.అనిత, అంబిక, పి. రాజు, ఏల రాజిరెడ్డి, ఎం.నగేశ్, ఎం సుశీల, ఎం గణేశ్, జి శశికళ, పోల్సాని సుధాకర్, దాసరి పెంటయ్య, మధుసూదన్ రెడ్డి, పి .నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

**బక్రీచేప్యాలలో...**

తెలంగాణ పాఠశాల విద్యాశాఖ, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థను స్ఫూర్తిగా తీసుకొని వృక్షాలను కాపాడుకోవాలనే ఉద్దేశంతో సిద్దిపేట జిల్లా సిద్దిపేట అర్బన్ మండలం బక్రి చెప్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న పురాతన చెట్టును మదర్ ట్రీ (చెట్టమ్మ) గా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దారం నాగేందర్ రెడ్డి ఉపాధ్యాయులు మామిడి పూర్ణచంద్రరావు, వర్కోలు లక్ష్మయ్య, సుహాసిని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెట్టం వేషధారణలో విద్యార్థిని ఆకట్టుకున్నారు.



## శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించాలి..

**-దాసరి సుధాకర్, ప్రధానోపాధ్యాయుడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మగ్దుంపూర్**

**సిద్దిపేట టైమ్స్, నంగునూరు, ఫిబ్రవరి 28:**



విద్యార్థులు ప్రతి విషయాన్ని శాస్త్రీయ దృక్పథంతో పరిశీలిస్తే అనేక విజ్ఞాన విషయాలు వెలుగులోకి వస్తాయని నంగునూరు మండలం మగ్దుంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి సుధాకర్ అన్నారు. శనివారం పాఠశాలలో జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవాన్ని(నేషనల్ సైన్స్ డే ను) నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఉపన్యాస పోటీలు ఏర్పాటు చేశారు. విజ్ఞాన పరికరాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. విద్యార్థులచే ప్రయోగాలు చేయించారు. అనంతరం వ్యాస రచన, ఉపన్యాస పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు దాసరి సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని చెప్పారు. మన చుట్టూ జరిగే సంఘటనల వెనుక ఉండే విజ్ఞానాన్ని శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు కత్తుల లక్ష్మారెడ్డి, జీడిపల్లి సురేందర్ రెడ్డి, దుద్దెడ పరశు రాములు, భైరు సత్తయ్య, ధీకొండ గోవర్ధన్, ఆదిరాల సాయినాథ శర్మ, ముస్లి రాజయ్య, తడకంటి రాజు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పాకాల యాదమ్మ, పారిశుద్ధ్య కార్మికురాలు అమ్ముల స్వప్న పాల్గొన్నారు.

## ప్రమాదానికి గురై... వైద్యం చేయించుకునే స్థోమత లేక.. మృతి చెందిన కార్మికుడు

**సిద్దిపేట టైమ్స్, నంగునూరు, ఫిబ్రవరి 28:**



నంగునూరు మండలం సిద్ధన్నపేట గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన దినసరి కార్మికుడు పంగ నరసింహారెడ్డి ఇటీవల మృతి చెందాడు. నరసింహారెడ్డి రోజు పని చేస్తే గాని కుటుంబం గడవని పరిస్థితి. ఈ స్థితిలో ఈ నెల 21 వ తేదీన కూలి పనికి వెళ్లిన నర్సింహారెడ్డి ద్విచక్ర వాహనంపై నంగునూరు నుండి సిద్ధన్నపేటకు వస్తుండగా వాహనం అదుపు తప్పింది. ప్రమాదవశాత్తు ఎదురుగా వస్తున్న ఓమిని వాహనానికి ఢీకొట్టింది. దీంతో నరసింహారెడ్డికి కాలతో పాటు తలకు తీవ్రమైన గాయం అయ్యింది. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆస్పత్రికి వెళ్లడానికి నిర్లక్ష్యం చేశారు. రెండు రోజుల అనంతరం ఆరోగ్య పరిస్థితి విషమించింది. దీంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆలస్యం కావడంతో కాలుకు తలకు తగిలిన గాయంతో బ్లడ్ ఇన్ఫెక్షన్ కావడంతో చికిత్స పొందుతూ గాంధీ హాస్పిటల్ లో మరణించినాడు. నరసింహారెడ్డి మరణించిన విషయాన్ని కార్మికుల ద్వారా తెలుసుకున్న జిల్లా ఆటో డ్రైవర్ కార్మిక విభాగం అధ్యక్షుడు, నంగునూరు మండల బీ ఆర్ ఎస్ కార్మిక విభాగం అధ్యక్షులు గోనేపల్లి సిద్దేశ్వర్ గౌడ్ శనివారం పరామర్శించారు. మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు దృష్టికి తీసుకువెళ్లి కార్మికుడు ఆయన నరసింహా రెడ్డి కుటుంబానికి ఆర్థిక సాయం అందేలా చేస్తానని హామీ ఇచ్చారు. నంగునూరు గ్రామానికి చెందిన ఆటో కార్మికుడు ఆరే శ్రీనివాస్ గౌడ్ తల్లి ఆరే విజయ అనారోగ్యంతో మరణించడంతో శ్రీనివాస్ ను పరామర్శించారు. ఈ కార్యక్రలో మండల ఆటో కార్మిక విభాగం కమిటీ సభ్యులు ఆంజనేయులు. మండల కార్మిక విభాగం ప్రధాన కార్యదర్శి వానరాశి హనుమంతు, హమాలి సంఘం కార్యదర్శి గజ్జల మధు సూదన్ రెడ్డి, సుధాకర్, పంగ తిరుపతిరెడ్డి, పంగ మల్లారెడ్డి. పంగ రాజేందర్ రెడ్డి, పుల్లగూర్ల శ్రీనివాస్ రెడ్డి,. సంపత్, డాకూరి రాజి రెడ్డి, పంగ మహేందర్ రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

## మార్కండేయ స్వామివారి ఆశీస్సులతో పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో, ఐశ్వర్యంతో వర్ధిల్లాలి

**- ధ్వజస్తంభం ప్రతిష్ఠా మహోత్సవనికి 25,000/- విరాళం అందించిన వంగ రాజేశ్వర్ రెడ్డి**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట బ్యూరో:**



సిద్దిపేట పట్టణంలోని శ్రీ మార్కండేయ దేవాలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న ధ్వజస్థంభ ప్రతిష్ఠా మహోత్సవ వేడుకల్లో వంగ రాజేశ్వర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేవాలయాలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ధ్వజస్థంభ ప్రతిష్ఠ వంటి మహోత్సవాలు సమాజంలో ఐక్యతను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం అభినందనీయమని తెలిపారు. రూ 25,000 రూపాయల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు.శ్రీ మార్కండేయ స్వామివారి ఆశీస్సులతో పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో, ఐశ్వర్యంతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఇటువంటి ధార్మిక కార్యక్రమాలు యువతలో మంచి సంస్కారాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.

## రాగి సందీప్ కి రూ 60 వేల LOC అందజేత

**సిద్దిపేట్ టైమ్స్ రామాయంపేట ఫిబ్రవరి 28**

రామాయంపేట మండల పరిధిలోని రాయలపూర్ గ్రామానికి చెందిన రాగి సందీప్ కు మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనపల్లి రోహిత్ రావు సహకారంతో రూ 60 వేల రూపాయల LOC ని రామాయంపేట మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనాంపల్లి రోహిత్ రావు అండగా ఉంటారని మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చింతల స్వామి, సంతోష్,, స్వామి, సత్యం, యాదగిరి, రాము, యాదగిరి, రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు



## శివాయి పల్లెలో పౌర హక్కుల దినోత్సవం

**- పౌరుల హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు**

**సిద్దిపేట టైమ్స్ రామాయంపేట ఫిబ్రవరి 28**



రామాయంపేట మండల పరిధిలోని శివాయిపల్లి గ్రామంలో శనివారం నాడు పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. పౌరుల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రామాయంపేట ఎస్సై ఆర్ బాలరాజు మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం ప్రతి పౌరుడికి స్వేచ్ఛ సమానత్వం కల్పించబడ్డాయని కులం పేరుతో ఎవరినైనా దూషిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హోటల్స్ లో రెండు గ్లాసుల పద్ధతులు పాటించవద్దని పాటిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట ఎస్సై ఆర్ బాలరాజు, ఆర్ఐ. మహమ్మద్ గౌస్, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు

## హుస్నాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**సిద్దిపేట టైమ్స్ హుస్నాబాద్**



రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఏసీపీ సదానందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సుదూర ప్రాంతాలకు వెళ్లే డ్రైవర్లకు కంటి పరీక్షలు చేశారు. చూపు మందగించడం వల్ల ప్రమాదాలు జరిగే ముప్పు ఉన్నందున ఈ ఏర్పాటు చేసినట్లు ఏసీపీ తెలిపారు.

## శ్రీ సరస్వతీ శిశు మందిర్ హుస్నాబాద్, పాఠశాలలో జాతీయ సైన్స్ డే

**సిద్దిపేట టైమ్స్ హుస్నాబాద్**





4th ,5th, 6th క్లాస్ , విద్యార్థిని విద్యార్థులు సైన్స్ ప్రయోగాలు చేయడం జరిగింది ఈ ప్రయోగాలలో ప్రకృతికి సంబంధించిన ప్రయోగాలు చేయడం జరిగింది విద్యార్థిని విద్యార్థులు ఎంత ఉత్సాహంగా పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఉపాధ్యక్షులు కొత్తపల్లి అశోక్ ప్రబంధకరణి శ్రీ బబ్బుల రవీందర్ గారు ప్రధానాచార్య పాలరాం శ్రీలత విద్యార్థిని విద్యార్థులను అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాతాజీలు ఆచార్యులు పాల్గొన్నారు.